ఉష్ణోగ్రత (అంచనా) 1-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	28
తెనాలి	40	28
నరసరావుపేట	41	28
బాపట్ల	40	28
రెంటచింతల	40	28
చీరాల	40	28



ఓ తండ్రి తన కొడుక్కి.. పక్కింటి కుర్రాడి కంటే ఖరీదైన బైక్ కొనిచ్చాడు. ఆ కుర్రాడి కంటే మార్కులు తక్కువ వచ్చినప్పుడు.. 'వాడి కంటే మంచి బైక్ కొనిచ్చాను. ఎక్కువ మార్కులు ఎందుకు రాలేదు..' అని కొడుకుపై తిట్ల పురాణం ఎత్తుకున్నాడు. కానీ, బైక్‌కు, మార్కులకు ఉన్న సంబంధం ఏంటో గుర్తించలేక పోయాడు.

> పిల్లల మనసు తెల్లకాగితం లాంటిది. దాని మీద ఏమి రాస్తే.. అదే వారి జీవితం అవుతుంది. రాసేది ఎప్పటికీ చెరిగిపోకుండా.. మంచి పెన్నుతో ఒకేసారి రాయండి. అంతేగాని కావాల్సినప్పుడల్లా చెరిపివేసే పెన్సిల్‌తో రాయకండి.
>
> - రూసో, ఫ్రెంచి తత్వవేత్త(1712-1798)



sunday special

పోలికలే పసి ప్రాయానికి ప్రమాదం

- పిల్లలపై పెరుగుతున్న తల్లిదండ్రుల ఒత్తిడి
- స్పష్టతలేని లక్ష్యాల వేటలో చిన్నారులకు శిక్షణ
- మానసిక వేదనలో కౌమారం
- ఆరోగ్యంపై పడుతున్న ప్రభావం

పెంపకంలో పెరుగుతున్న వ్యత్యాసాలు

బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు అంతర్జాతీయ స్థాయిలో రాణించి, ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకాలు సాధించింది. ఆమెను స్ఫూర్తి పొందిన చాలా మంది తల్లిదండ్రులు వెంటనే తమ పిల్లలను బ్యాడ్మింటన్ అకాడమీల్లో చేర్పించారు. సమయం కుదరకో.. ఇతర ఇబ్బందుల వల్లనో నాలుగైదు నెలల తరువాత కొంతమంది ఆ ప్రయత్నం విరమించుకున్నారు. ఇటీవల ఐపీఎల్‌లో 14 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవన్షి రాజస్థాన్ రాయల్స్ తరపును ఎంట్రీ ఇవ్వడంతో.. మరికొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను క్రికెట్ అకాడమీలకు శిక్షణ కోసం పంపిస్తున్నారు.

గుంటూరు(తూర్పు), మే 31 (ఆంధ్రజ్యోతి): ఇతరుల పిల్లలు చదువు, క్రీడలు తదితర రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిస్తే.. తమ పిల్లలను కూడా అదే స్థాయిలో చూసుకోవాలని చాలామంది తల్లిదండ్రులు భావిస్తారు. వారిని స్ఫూర్తి పొంది ఆయా రంగాల్లో రాణించాలని తమ చిన్నారులకు కొత్త మార్గాలను నిర్దేశిస్తుంటారు. కొంతకాలానికి మరో చోట ఎవరో ఏదో సాధిస్తే.. మీరు కూడా అది నేర్చుకోవాలంటూ అందులో శిక్షణ ఇప్పిస్తుంటారు. తల్లిదండ్రుల ఈ ఆలోచనా ధోరణే.. ప్రస్తుత తరాన్ని గందరగోళంలోకి నెట్టేస్తోంది. తమను ఎలా చూసుకోవాలని అమ్మ నాన్నలు అనుకుంటున్నారో అర్థం కాక.. పసి వయసులోనే.. మానసిక వేదనకు (మిగతా 8వ పేజీలో)

కాల్వలకు కాసులు



నరసరావుపేట : ఇది మైనర్ కాలువే.. కాల్వ కనిపించనంతగా పెరిగిన జమ్ము

ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోక.. తూటికాడ, నాచుతో నిండిపోయి.. సాగునీరు పారుదలకు అవకాశం లేక అధ్వానంగా మారిన కాల్వలకు మోక్షం కలిగింది. ముందస్తు రుతు పవనాలతో వర్షాలు పడుతుండగా.. పదునెక్కిన పొలాలను రైతులు సాగుకు సిద్ధం చేస్తుండగా.. సాగునీటికి దిగులు లేకుండా చేసేందుకు ప్రభుత్వం కాల్వల మరమ్మతులకు నిధులు కేటాయించింది. సాగునీటి కాల్వల దుస్థితిపై సమగ్రంగా అవగాహన ఉన్న సాగునీటి సంఘాలకే నిర్వహణ, మరమ్మతులు చేపట్టేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సాగునీటి సంఘాలు ముందుకు రాని ప్రాంతాల్లో స్వల్పకాలిక టెండర్లు నిర్వహించి కాల్వల మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఆయా మరమ్మతు పనులు సత్వరం చేపట్టాలని రైతులు కోరుతున్నారు. మరమ్మతు పనులు సక్రమంగా.. సమగ్రంగా జరిగితే ఆయకట్టులోని చివరి భూములకు కూడా పుష్కలంగా సాగునీరు అందే అవకాశం ఉంటుంది. మరి పనులు ఏవిధంగా జరుగుతాయో చూడాలి.

- ఎట్టకేలకు మరమ్మతులకు మోక్షం
- సాగర్ పరిధిలో 801 పనులు గుర్తింపు
- రూ.37.44 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- సాగునీటి సంఘాలకు పనులు కేటాయిస్తూ ఆదేశాలు
- సంఘాలు ముందుకు రాని చోట స్వల్పకాలిక టెండర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(నరసరావుపేట, బాపట్ల - ఆంధ్రజ్యోతి)

అధ్వానంగా ఉన్న సాగర్ కాల్వల బాగుకు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. 'కాసుల పారుదల కనిపించడం లేదు' అనే శీర్షికతో కాల్వల అధ్వాన స్థితిపై ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై ప్రభుత్వం స్పందించింది. రూ.37.44 కోట్లు నిధులు మంజూరు చేసింది. జల వనరుల శాఖ గుర్తించిన 801 అత్యవసర పనులు చేపట్టేందుకు అధికారులు (మిగతా 8వ పేజీలో)

ఈ పనులు చేపట్టాలి..

- కాల్వల్లో ఐదేళ్లుగా పెరిగిన కంప చెట్లను, అల్లుకుపోయిన జమ్ము, తూటుకాడ, రబ్బరు మొక్కలను తొలగించాలి.
- పగిలిపోయి దెబ్బతిన్న డ్రాపులు, షట్టర్లకు మరమ్మతులు చేయాలి.
- షట్టర్లు లేక పోవడంతో సాగునీరు వృథాగా వాగుల్లో పారుతున్నది. వృథాను అరికట్టేందుకు షటర్ల ఏర్పాటు తక్షణావసరం.




తరగతి మారదా?

- గుంటూరులోని కేవీపీ కాలనీలోని కొల్లి శారదా మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ దుస్థితి

- మరో పది రోజుల్లో బడులు ప్రారంభం
- పాఠశాలల్లో అసంపూర్తిగానే నిర్మాణాలు
- అరకొర పనులతో గతేడాది విద్యార్థులకు ఇక్కట్లు
- ఈ ఏడాదీ గదుల కొరతతో ఇబ్బందులు
- తప్పేలా లేవని ఆందోళన
- వరండాలు, చెట్ల కింద చదువులు తప్పవని ఉపాధ్యాయుల ఆవేదన

గుంటూరు(విద్య), మే 31 (ఆంధ్రజ్యోతి): మరో పది రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. అయితే గత ఏడాది గదులు కొరత.. పాఠశాల ఆవరణలో నిర్మాణ సామగ్రితో.. విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో అయినా నిర్మాణాలు పూర్తి చేసుకుని గదుల కొరత తీరి సాఫీగా బోధన జరుగుతుందని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. ఈ ఏడు కూడా (మిగతా 8వ పేజీలో)



బుగ్గవాగు నుంచి విడుదలవుతున్న నీరు

..మరో 3 టీఎంసీలు

- తాగునీటి కోసం కేఆర్ఎంబీ ఆమోదం
- సాగర్ నుంచి నీటి సరఫరా కొనసాగింపు
- రోజుకు 5,500 కూసెక్కులు విడుదల

నరసరావుపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): తాగునీటి అవసరాల నిమిత్తం ప్రభుత్వ వినతి మేరకు కేఆర్ఎంబీ సాగర్ జలాశయం నుంచి మరో మూడు టీఎంసీల నీటిని కేటాయించింది. దీంతో మరో ఐదు రోజుల పాటు సాగర్ నుంచి నీటి విడుదల చేయనున్నారు. తొలుత తాగునీటి కోసం 4 టీఎంసీల నీటిని కేటాయించిన విషయం తెలిసిందే. ఈ నీటి వినియోగం పూర్తయ్యే లోపు మళ్లీ నీటి కేటాయింపునకు కేఆర్ఎంబీ అదనంగా ఆమోదం తెలిపింది. దీంతో సాగర్ నుంచి నీటి సరఫరాను జలవనరులు శాఖ కొనసాగిస్తోంది. రోజుకు డ్యాం నుంచి 5,500 కూసెక్కుల నీటిని కుడి కాల్వకు సరఫరా చేస్తున్నారు. తాగునీటి కోసం 10 టీఎంసీలు కేటాయించాలని జలవనరుల శాఖ కేఆర్ఎంబీని కోరగా రెండు విడతల్లో ఏడు టీఎంసీలు కేటాయించింది. కుడి కాల్వ పరిధిలోని ప్రకాశం, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని తాగునీటి నిల్వ చెరువులను నింపుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులను ఎస్ఈ కృష్ణమోహన్ కోరారు.

కోడి పందాల స్థావరంపై పోలీసుల దాడి

- చందవరంలో 35 మోటారు బైక్‌లు స్వాధీనం

నాదెండ్ల, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందవరం గ్రామ పరిధిలో కోడి పందాల స్థావరంపై శనివారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. 35 మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకుని తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పుల్లారావు తెలిపారు. వారం రోజులుగా సాతులూరు - చందవరం రహదారి సమీపంలోని పొలాల్లో కోడి పందాలను నిర్వహిస్తుండగా సమీప ప్రాంతాల నుంచి నిత్యం పెద్దసంఖ్యలో జూదరులు తరలివస్తున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు శనివారం దాడులు చేశారు. ఈ క్రమంలో పందాలకు వచ్చిన పలువురు పారిపోయారు. దీంతో ఆ ప్రాంతంలోని 35 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని ట్రాక్టర్లు, ఆటోలపై వాటిని నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



కోడి పందాల వద్ద పట్టుబడిన మోటారు బైక్‌లు

జాబ్‌మేళాకు.. అనూహ్య స్పందన

ఆరు నెలలకొకసారి నిర్వహిస్తామన్న జీవీ

వినుకొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ మేరకు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు అనూహ్య స్పందన వచ్చింది. పల్నాడు రోడ్డులోని జూనియర్ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించగా 1666 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరికి 28 కంపెనీల నిర్వాహకులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అంతకముందు జాబ్‌మేళాను ప్రారంభించిన జీవీ ప్రసంగిస్తూ రాష్ట్రంలోని 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకెళ్తుండగా ఈ కార్యక్రమంలో భాగంగా వినుకొండలో మెగా జాబ్‌మేళా నిర్వహించామన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని ప్రతీ ఆరు నెలలకు ఒకసారి చేపడతామన్నారు. ఇష్టంతో ఎంచుకున్న ఉద్యోగాల్లో కష్టపడి పనిచేస్తే సాఫ్ట్‌వేర్ మించిన జీతాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీబ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.



యువతకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగ యువతీ యువకులు

160 దరఖాస్తులకు 142 ఆమోదం

పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమీక్షలో కలెక్టర్

నరసరావుపేట టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక అభివృద్ధి విధానంలో మే నెలకు సంబంధించి జిల్లాలో 160 దరఖాస్తులకు 142 ఆమోదించినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. సూక్ష్మ చిన్న సంస్థలు, క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, ప్రధానమంత్రి ఉపాధి హామీ తదితర పథకాల ప్రోత్సాహకాలపై కలెక్టరేట్‌లో శనివారం జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. సింగిల్ డెస్క్‌పోర్టల్ క్లియరెన్స్, ఎస్సీ/ఎస్టీ లబ్ధిదారులకు పెట్టుబడి, పారిశ్రామిక అభివృద్ధి రాయితీ, ప్రధానమంత్రి ఉపాధి కల్పన, సులభతర వ్యాపారం, సూక్ష్మ చిన్న సంస్థలు, క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ తదితరాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఉపాధి హామీ పథకానికి సంబంధించి కేవీఐసీ దరఖాస్తులు ప్రక్రియ వేగవంతంగా ఉండాలన్నారు. రుణాల విడుదల ప్రక్రియను వేగవంతం చేయాలని బ్యాంకర్లను జేసీ ధనుంజయ్ గనోరే కోరారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనలో 5291 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. 3365 దరఖాస్తుల్లో 545 మంజూరు కాగా 499 యూనిట్లకు బ్యాంకుల నుంచి రుణాలు విడుదలయ్యాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి సుధాకర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌తో పాటు అధికారుల, ఇండస్ట్రియల్ అసోసియేన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

యోగాపై పోటీలు.. బహుమతులు

గ్రూపుల వారీగా నిర్వహణకు ఆదేశాలు జారీ

నరసరావుపేట కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా యోగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను శనివారం ఆదేశించారు. తొలుత గ్రామస్థాయిలో అనంతరం మండల, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేయాలన్నారు. ఆసనాలు, స్కిట్స్, పెయింటింగ్, సాంగ్, రోల్‌ప్లే, క్విజ్, పోస్టర్, స్లోగన్, ఎస్సే, షార్ట్‌ఫిల్మ్, ఫొటోగ్రఫీ తదితర అంశాలలో గ్రూపుల వారీగా యోగాపై పోటీలు నిర్వహించాలన్నారు. 10 నుంచి 18 ఏళ్ల వారిని జూనియర్ గ్రూపుగా, 19 నుంచి 35 వయస్కులను యంగ్ గ్రూపుగా 35 ఏళ్లు పైబడిన వారిని సీనియర్ గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. షార్ట్ ఫిల్మ్, పోస్టర్, స్లోగన్, ఫొటోగ్రఫీ విభాగాలలో పోటీ పడాలనుకునే వారు జూన్ 10లోపు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9440611107 నంబరులో సంప్రదించాలన్నారు. యోగాంధ్రలో భాగంగా శనివారం నరసరావుపేటలో జరిగిన శిక్షణలో ఉద్యోగులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నరసరావుపేటలో యోగా చేస్తున్న ఉద్యోగులు

కరోనాపై అధికారులు అప్రమత్తం కావాలి

● జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా



స్థాయి సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా

గుంటూరు సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా కరోనా కేసులు ప్రబల కుండా వైద్య, ఆరోగ్య శాఖతో పాటు అన్ని శాఖల అధికారులు అప్రమత్తం కావాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆదేశించారు. శని వారం జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘాలు ఒకటి నుండి ఏడు సమావేశాలు జడ్పీ కార్యాలయంలో జరిగాయి. 1, 4, 7 స్థాయి సంఘ సమావేశాలకు చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షత వహిం చారు. మూడవ స్థాయి సంఘ సమావేశానికి దుర్గి జెడ్పీటీసీ సభ్యుడు శెట్టిపల్లి యలమంద, ఐదవ స్థాయి సంఘ సమావేశానికి తెనాలి జడ్పీటీసీ సభ్యు రాలు పిల్లి ఉమా ప్రణతి, ఆరవ స్థాయి సంఘ స మావేశానికి వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్య క్షత వహించారు. మూడవ స్థాయి సంఘ సమా వేశానికి ముందుగా వైస్ చైర్మన్ నర్సిరెడ్డి అధ్యక్షత వహిస్తారని అజెండాలో పేర్కొనగా.. ఆయన గైర్హాజరుతో దుర్గి జడ్పీటీసీ యలమంద సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆయా సమావేశాల్లో గ్రామాల్లో నెలకున్న పారిశుధ్యం, డ్రెయినేజీ, సీజనల్ వ్యాధులు, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, జల వనరులు, వ్యవసాయం, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలను జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కాకుమానులో బాలికల వసతి గృహానికి ప్రహరీ సమస్య, అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘన తదితర అంశాలను జడ్పీటీసీ సభ్యులు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరిస్తామన్నారు. వివిధ పనులకు నిధుల విడుదలపై చర్చించారు. 6వ స్థాయి సంఘ సమావే శంలో వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ సాంఘిక సంక్షేమం, ట్రైబల్, బీసీ, మైనారిటీ సంక్షేమం, కార్పొ రేషన్లు, డీఆర్డీఏ, వెలుగు తదితర శాఖల అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. వట్టిచెరుకూరు బీసీ హాస్టల్ విద్యార్థి చెరువులో పడి చనిపోయిన ఘటనలో హాస్టల్ వార్డెన్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసిందని బీసీ సంక్షేమ అధికారి సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, డిప్యూటీ సీఈఓ కృష్ణ, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల అధికారులు పాల్గొ న్నారు. రెండవ స్థాయి సంఘ సమావేశం కోరం లేక వాయిదా పడింది. మిగిలినవి యథావిధిగా జరిగాయి.

పింఛన్ల పంపిణీలో ఏపీ టాప్ : యరపతినేని



పిడుగురాళ్లలో పింఛన్ నగదు అందిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మే 31 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీలో దేశంలోనే ఏపీ టాప్‌లో ఉందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం పిడుగురాళ్ల పట్టణం, తుమ్మలచెరువు గ్రామంలో పింఛన్ల నగదు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేనితో పాటు టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల్లో పింఛన్‌దారుల ఉసురే జగన్‌కు తగిలిందన్నారు. ఎక్కడో కూర్చొని వీడియోలు రిలీజ్ చేసే వారికి. తాను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. వైసీపీ ఐదేళ్ల హయాంలో టిడ్కో గృహాలు, ఆర్‌ఓబీ, మున్సిపల్ కార్యాలయం, బైపాస్ ప్రాజెక్టు పూర్తి చేయలేదు కానీ, నరసంరావుపేటలో ప్రాజెక్టు మాత్రం కాసు పూర్తి చేసుకున్నారని విమర్శించారు. జరిగిన ఎన్నికల్లో గురజాలలో ఎవరు ఓడినా రాజకీయ సన్యాసం చేస్తామని ప్రకటించడం జరిగిందని, ఓడిన కాసు మహేష్‌రెడ్డి ఆ మాటకు కట్టుబడి ఉన్నట్టా.. లేనట్టా.. అనేది స్పష్టం చేయాలన్నారు. తప్పు చేసిన వైసీపీ కార్యకర్తలను పోలీసులు తీసుకొస్తుంటే రంకెలేస్తున్నారని, ఆడబిడ్డలపై అసత్య పోస్టులు పెడుతుంటే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ఓడిపోయి మంచి జరిగిందని, చంద్రబాబు పాలనపై ప్రజలు నమ్మకంతో ఉండ బట్టే ఈరోజు సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతున్నాయన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాకుంటే రాష్ట్రం రావణకాష్టంలా తయారై ఉండేదని, ఆ పార్టీలో ఉన్న తనకే యావగింపు పుట్టి బయటకు రావడం జరిగిందన్నారు. తుమ్మలచెరువు సమీపంలో ఉపాధి పనులకు హాజరైన శ్రామికులు ఎమ్మెల్యే యరపతినేని, జంగా కృష్ణమూర్తిలను కలిశారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ మధుబాబు, ఎంపీడీఓ రామచంద్రరావు, కమిషనర్ పి.శ్రీధర్, ఏఎంసీ చైర్మన్ తురకావీరస్వామి, కనిగిరి శ్రీను పాల్గొన్నారు.

కాల్వలకు కాసులు

(5వ పేజీ తరువాయి)

సమాయత్తమవుతున్నారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో కాల్వల మ రమ్మతులు చేపట్టనున్నారు. కాల్వల బాగుకు ప్రభు త్వం నడుంకట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగర్ కుడి కాల్వ పరిధిలో అధ్వానంగా ఉన్న మేజర్లు, మైనర్లు, సబ్ మైనర్ కాల్వల చివరి భూములకు పూర్తిస్థాయిలో సాగు నీరందించే లక్ష్యం తో పనులు చేపట్టనున్నారు. విత్తనాలు విత్తుకునే స మయం అసన్నమయ్యేలోగా కాల్వల్లో పూడికతీతతో పాటు అవసరమైన ప్రాంతాల్లో అత్యవసర మరమ్మ తులు చేపట్టి పూర్తి చేసేందుకు అధికార యంత్రాం గం, సాగునీటి సంఘాలు సమాయత్తమయ్యాయి. నీటి సంఘాలు పనులు చేసేందుకు ముందుకు రాని పక్షంలో అటువంటి చోట్ల రూ.10 లక్షల విలువైన ప నులకు స్వల్పకాలిక టెండర్లు నిర్వహించాలని ప్రభు త్వం ఆదేశాలు జారీ చేసింది. యుద్ధప్రాతిపదికన కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని కూడా కమిషనర్ సూచించారు. రుతు పవనాలు విస్తరిం చిన నేపథ్యంలో పనులకు ఆటంకం ఏర్పడే పరిస్థి తులు ఉన్నాయి. అయితే ఇప్పటికే గుంటూరు, ప ల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో కొన్ని కాల్వల పనులు ముందస్తుగా ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో శనివారం నుంచి పనులు ప్రారంభమయ్యాయి.

పనులు వేగవంతం

డెల్టా పరిధిలో కాల్వల మరమ్మతులకు ఇప్పటికే ప్రభుత్వం అనుమతి ఇచ్చి ఉండటంతో నీటి సంఘాల ఆధ్వర్యంలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. బాపట్ల కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధికారుల బృందంతో కలిసి ఆయా పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు కూడా చేశారు. రూ.10 లక్షల లోపు పనులను నామినేషన్ పద్ధతిన చేపట్టే అవకాశం కల్పించడంతో నీటి సంఘాలు పనులకు శ్రీకారం చుట్టాయి. ఎక్స్‌కవేటర్లతో పీటీ ఛానల్, న్యూ ముత్తాయపాలెం, లంక, తుమ్మలశాఖ, అడవిబ్రాంచ్ తదితర కాల్వల మరమ్మతులు జరుగుతున్నాయి. ఇరిగేషన్, డ్రెయినేజి పరిధిలో 109 పనులను రూ.3.01 కోట్లతో చేస్తున్నారు.

సంగం డెయిరీలో నైజీరియా బృందం



నైజీరియా జిగావా రాష్ట్ర గవర్నర్ మల్లం ఉమర్‌కు స్వాగతం పలుకుతున్న సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): సంగం డెయిరి ఉత్పత్తులను పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో నైజీరియాలో దిగుమతి చేసుకోవాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు నైజీరియాలోని జిగావా రాష్ట్ర గవర్నర్ మల్లం ఉమర్ ఏ నమాడీ తెలిపారు. శనివారం వడ్లమూడి సంగం డెయిరీని నైజీరియా జిగావా రాష్ట్ర ప్రతినిధి బృందం సందర్శించింది. గవర్నర్ మల్లం ఉమర్ నేతృత్వంలో వ్యూహాత్మక భాగస్వామ్యాలు ఏర్పరుచుకోవడంలో భాగంగా సంగం డెయిరిని సందర్శించారు. ఈ సందర్భంగా మల్లం ఉమర్ బృందానికి చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఘన స్వాగతం పలికారు. డెయిరీలోని మార్కెటింగ్, సేల్స్, ప్రాసెసింగ్ యూనిట్‌లను నైజీరియా బృందం పరిశీలించింది. కాకాణి వెంకటరత్నం పశుదాణా కర్మాగారాన్ని సందర్శించారు. మేలైన పశు జాతి వృద్ధి, కృత్రిమ గర్భాధారణ కేంద్రాల స్థాపన తదితర అంశాలపై డెయిరి అధికారులు వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గవర్నర్ మల్లం ఉమర్ మాట్లాడుతూ నైజీరియాలోని జిగావా రాష్ట్రాన్ని వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రపంచ ఉత్తమ పద్ధతుల్లో అభివృద్ధి చెయడానికి సంగం డెయిరీని ఎంచుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిగావా రాష్ట్ర ప్రతినిధులు సైఫుల్లాహి ఉమర్, అవువాలు షోహూ, డాక్టర్ సులైమాన్ రుఫాయి, డాక్టర్ సలీమ అబ్దుల్లా హీ, అలియా ఇనువా, నాసిరు అహ్మద్, మహ్మద్ దన్యారో, సంగం డెయిరీ ఎండీ గోపాలకృష్ణన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి మణిపాల్‌లో వాస్క్యులర్ ఉచిత ఓపీడీ సేవలు

తాడేపల్లి టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పరిధిలోని మణిపాల్ హాస్పిటల్‌లో వాస్క్యులర్ సంబంధిత వ్యాధుల కోసం ఉచిత ఓపీడీ సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు హాస్పిటల్ ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ నందన్ వేమూరి (కన్సల్టెంట్ వాస్క్యులర్ సర్జన్) జూన్ 2 నుండి 15వ తేదీ వరకు ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత ఓపీడీ కన్సల్టేషన్ సేవలు అందించనున్నారని పేర్కొన్నారు. వాస్క్యులర్ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి నిపుణుల ద్వారా వైద్య సలహా అందించ డాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రద్దీని నివారించేందుకు ముందస్తు అపాయింట్‌మెంట్ తీసుకోవడం తప్పనిసరి అని తెలిపారు. వెరికోస్ వెయిన్స్, మానని గాయాలు, డయాలసిస్ యాక్సెస్ సమస్యలు, కాళ్ల నొప్పులు, తిమ్మిరి సమస్యలు, కాళ్లు రంగు మారడం వంటి సమస్యలను పరీక్షిస్తారని పేర్కొన్నారు. అపాయింట్‌మెంట్ కోసం 93929 11288 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

చట్టం నుంచి తప్పించుకోలేరు

● కోవర్టులతో అప్రమత్తంగా ఉండాలి ● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, మే 31 (ఆంధ్రజ్యోతి): గుండ్లపాడు గ్రామంలో జంట హత్యలను ప్రేరేపించేలా వ్యవహరించిన వ్యక్తులు చట్టం నుంచి తప్పించుకోలేరని, వారికి శిక్ష తప్పదని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు. శనివారం పాలువాయి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది నుంచి ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో రాజకీయ కక్షలు రెచ్చగొట్టి.. పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆగ్రహించారు. అందులో భాగంగానే టీడీపీకి చెందిన వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావును అత్యంత కిరాతకంగా హత్య చేయించి, తమకేమి తెలియదన్నట్లుగా నటిస్తున్నారని దుయ్యబట్టారు. టీడీపీలోకి కోవర్టులను పంపించి నేతల సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించుకుని ఈ దారుణాలకు ఒడిగొట్టారని ఎమ్మెల్యే ఆరోపించారు. తమ మంచితనాన్ని అలుసుగా తీసుకుని అరాచకానికి పాల్పడితే చూస్తు ఊరుకోబోమని హెచ్చరించారు. కపడలో నిర్వహించిన మహానాడు అటు కార్యకర్తలు ఇటు నేతల్లో జోష్ నింపిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకుని పెట్టుబడి సాయం పొందాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు అబ్బిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుమంత్‌రెడ్డి, బీసీ నేత ప్రభురాజు యాదవ్, పంగులూరి పుల్లయ్య, రాయపరెడ్డి, శౌర్రెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి తదితరులున్నారు.

జడ్పీ ఉద్యోగులకు రేపు కౌన్సెలింగ్

గుంటూరు సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఉద్యో గులకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహిం చనున్నట్లు సీఈఓ జ్యోతి బసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 222 పోస్టులకు 198 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల అర్హతలు, నిబంధనలు ఆధారంగా బదిలీల ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 31 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 512.40 అడుగులు ఉంది. ఇది 135.78 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5598 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ 450 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 6048 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

సోనూసూద్‌కు ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఆహ్వానం

❖ ప్రత్తిపాటి ఫౌండేషన్ సేవలపై ప్రజెంటేషన్



ప్రముఖ నటుడు సోనూసూద్ తో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే31 (ఆంధ్రజ్యోతి): నటనతోనే కాకుండా సేవాకార్యక్రమాలతోనూ నటుడు సోనూసూద్ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్లో నటుడు సోనూసూద్‌తో ఆయన మర్యాదపూర్వకంగా సమావేశ మయ్యారు. చిలకలూరిపేటలో ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను సోనూసూద్‌కి వివరించారు. పట్టణంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం గురించి తెలిపారు. వేలాది మందికి నేత్ర వైద్య సేవలు అందించడంపై సోనూసూద్ సంతోషం వ్యక్తంచేసి, ప్రత్తిపాటిని అభినందించారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ స్థాపించిన నాటి నుంచి చేపట్టిన సేవా కార్యక్రమాలను ప్రత్తిపాటి ప్రజంటేషన్ ద్వారా సోనూసూద్‌కి వివరించారు. దీంతో వీలుచూసుకొని చిలకలూరిపేటకు రావాలన్న ప్రత్తిపాటి విజ్ఞప్తికి సోనూసూద్ సానుకూలంగా స్పందించారు. మంచి కార్యక్రమం చేపట్టి, తనకు తెలియజేస్తే తప్పకుండా వస్తానని సోనూసూద్ ప్రత్తిపాటికి హామీ ఇచ్చారు.

తరగతి మారదా?

(5వ పేజీ తరువాయి)

వరండాలు, చెట్ల కింద చదువులు తప్పవని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. పునః ప్రారంభానికి గడువు ముంచుకొస్తున్నా అధికారుల్లో చలనం లేదు. ఇప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిన నాడు నేడు పనులు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన మొదట్లో కొద్దిరోజులు పనుల్లో వేగం పెరిగినా అది మూణ్ణాళ్ల ముచ్చటగానే మారింది. దీంతో రాబోయే విద్యా సంవత్సరంలో కూడా తరగతి గదులు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదని ప్రధానోపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ హయాంలో రెండు విడతల్లో నాడు నేడు పనులు అనేక పాఠశాలల్లో అసంపూర్తిగానే ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.1000 కోట్లతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టారు. అయితే పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం, బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో ఇప్పటికీ అనేక పాఠశాలల్లో పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. ఇప్పటికీ వందల సంఖ్యలో పాఠశాలల్లో అసంపూర్తి గదులు నిర్మాణాలు వెక్కిరిస్తున్నాయి. పూర్తయిన భవనాలకు ప్లాస్టింగ్, విద్యుత్ కనెక్షన్లు, ఫ్లోరింగ్, ప్లంబింగ్ తదితర పనులు కూడా ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో బోధన ఎలా చేయాలో అర్థం కాక ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఆయా పనులపై పర్యవేక్షణ లేకుండా పోయింది. గుంటూరు నగరంలోనే దాదాపు పది పాఠశాలల్లో నిర్మాణాలు పూర్తి కాలేదంటే మారుమూల ప్రాంతాల్లో పాఠశాలల్లో పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

ఎస్పీ స్థాయి అధికారికి.. జంట హత్యల కేసు విచారణ

మాచర్లటౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): సంచలనం రేకెత్తించిన పల్నాడు జిల్లాలోని వెల్దుర్తి మండలం గుండ్లపాడు జంట హత్యల కేసు విచారణ ఉన్నతాధికారుల చేతుల్లోకి వెళ్లింది. హత్యలు జరిగిన వెంటనే సీఐ స్థాయి అధికారితో విచారణ జరపాలని ఉన్నతాధికారులు భావించారు. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడంతో ఉన్నతాధికారులు పునరాలోచనలో పడ్డారు. ఈ కేసును ఎస్పీ స్థాయి అధికారికి బాధ్యతలు కల్పించి, మానిటరింగ్ ఐజీ స్థాయి అధికారికి అప్పగించినట్లు విశ్వసనీయ సమాచారం. ముగ్గురు సీఐలు, ముగ్గురు ఎస్ఐలతో ఏర్పాటు చేసిన బృందాలు విచారణ ముమ్మరం చేశాయి. సోమవారం లేదా మంగళవారం నాటికి కేసు విచారణ ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. నిందితులతో సన్నిహితంగా మెలిగిన వ్యక్తులు, సెల్‌ఫోన్ కాల్ లిస్ట్, నగదు లావాదేవీలు, కుట్ర కోణం, సూత్రధారులు ఇలా అన్ని అంశాల్లో లోతైన దర్యాప్తు కొనసాగుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121. 129. 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఉచిత విద్య..

సత్తెనపల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమట్రస్ట్ దాతల సహకారంతో అనాథ విద్యార్థులు 30మందికి ఇంటర్‌లో ఉచిత విద్యను అందించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పరీక్షల్లో నాలుగు వందలకు పైగా మార్పులు వచ్చినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 80968 24399, 79899 27520 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

పొగ పీల్చినా నష్టమే...

రెంటచింతల, మే 31(ఆంధ్రజ్యోతి): సరదాగా మొదలు పెట్టిన ధూమపానం వ్యసనంగా మారి చివరికి ప్రాణాలు హరించివేస్తుందని వాటి నుంచి యువత దూరంగా ఉండాలని తహసీల్దార్ డి.మేరికనకం కోరారు. శనివారం ధూమపాన వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని తన కార్యాలయంలో ఆమె పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, బీజేపీ సీనియర్ నేత కాశీపతి, కట్టిబోయిన సైదులు తదితరులున్నారు.

ఏపీఆర్‌డీసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నయీంబాను

మాచర్ల రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో గల ఏపీఆర్‌డీసీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నయీంబాను శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా ఉన్న వైఎస్ఎస్ చౌదరి పదవీవిరమణ పొందారు. పొలిటికల్ సైన్స్ అధ్యాపకురాలిగా 2013లో ఆమె ఏపీఆర్‌డీసీకి వచ్చారు. డాక్టర్ నయీంబానుకు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

92 శాతం పింఛన్ల పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీడీవో కాశయ్య, ఈవోపీఆర్‌డీ

నకరికల్లు, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలో 92శాతం పింఛన్ల పంపిణీ శనివారం పూర్తిచేసినట్లు ఎంపీడీవో జి.కాశయ్య తెలిపారు. ఈవోపీఆర్‌డీ కేవీఎస్ ప్రసాదుతో కలిసి ఆయన మండలంలో పింఛను లబ్ధిదారులకు అందజేశారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా దయాసాగర్

పిడుగురాళ్ల, మే 31 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి ఎంపీడీఓగా వి.దయాసాగర్‌ను నియమిస్తూ జడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఎంపీడీఓ సీహెచ్ రామచంద్రరావు పదవీవిరమణ చేశారు. ఈఓపీఆర్డీ దయాసాగర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

సబ్సిడీపై గడ్డి విత్తనాలు

దాచేపల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పశు సంవర్ధక శాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం 50శాతం రాయితీపై విత్తనాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

అపూర్వ సమ్మేళనం

నకరికల్లు, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని, ఎంతోమంది వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉండటం ఎంతో గర్వకారణమని కుంకలగుంట జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శనివారం 2006 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాలలో జరిగింది. 20 ఏళ్ల తర్వాత ఇలా కలుసుకోవటం ఎంతో ఆనందంగా ఉందని, నాటి సంఘటనలు గుర్తు చేసుకొని విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు. పూర్వ విద్యార్థులు మొహిద్దీన్, వీరప్పయ్య, శర్మ, బాలరాజు, వెంకటేశ్వర్లు, మంగపతిరావు, పూర్ణచంద్రరరావు, ఫిజికల్ డైరెక్టర్ ఉన్నం పద్మావతి, హెచ్ఎం కె.మేరీరాణి, విద్యా కమిటీ చైర్మన్ ఆర్ హనుమంతరావు, ఆవుల రమణయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ షాపుల్లోనే సరుకుల పంపిణీ

దాచేపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 42 రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకుల పంపిణీ ఆదివారం నుంచి జరుగుతుందని తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు పని చేస్తాయని పేర్కొన్నారు. వృద్ధులు, శారీరక వైకల్యం ఉన్నవారి ఇళ్లకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తారని తెలిపారు.

రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు..

నకరికల్లు, మే 31 (ఆంధ్రజ్యోతి): రాయితీపై పచ్చి రొట్ట ఎరువులను రైతు సేవా కేంద్రాల్లో అందిస్తున్నట్లు ఏవో కె.దేవదాసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనుము నాలుగు కిలోలు, జీలుగ నాలుగు కిలోలు, పిల్లి పెసర రెండు కిలోలు మొత్తం పది కిలోలు ధర రూ.1,296 కాగా 50 శాతం రాయితీపోను రూ.648 అందిస్తున్నట్లు ఏఓ పేర్కొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

2023-24 విద్యా సంవత్సరానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాని విద్యార్థులు జియో మ్యాపింగ్ ఐన సచివాలయంలో ఈకేవైసీ చేయించుకోవాలని ఈవోపీఆర్డీ కేవీఎస్ ప్రసాదు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజు చెల్లించినవారు రసీదులను సచివాలయంలో చూపించి, విద్యార్థి తల్లి లేదా విద్యార్థి ఈకేవైసీ చేయించాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విద్యుత్ మరమ్మతుల కారణంగా నకరికల్లులో ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఏఏ గౌస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముగిసిన శిక్షణ తరగతులు

మాచర్లటౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన స్పోకెన్ ఇంగ్లీష్, నైతిక, ఆధ్యాత్మిక విలువల క్లాసులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా క్లాసుల నిర్వాహకుడు, సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నైతిక, ఆధ్యాత్మిక విలువలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌కేబీఆర్ జూనియర్ కళాశాల అధ్యాపకులు దుర్గ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళాజాత

గురజాలటౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యాన శనివారం పట్టణంలోని బస్టాండ్ వద్ద కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. ఎయిడ్స్‌కు కారణాలు, నివారణ జాగ్రత్తలు, ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా అందిస్తున్న మందులు తదితర వాటిపై కళాజాత బృందం నాటకం ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్ కృష్ణ, ఓఆర్‌డబ్ల్యూ రమాదేవి, పీఈ సుందరమ్మ, ఝాన్సీ కనికరమ్మ, వీర్నాల మల్లికార్జునరావు, వెంకటలక్ష్మి, మిర్యాల మల్లయ్య, కనకరావు, ప్రభావతి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో అందరూ సమానులే

మాచవరం, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో అందరూ కులమతాలకు అతీతంగా నడుచుకుంటూ వ్యవహరించాలని తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావు సూచించారు. శనివారం మాచవరం ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సివిల్స్ రైట్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, ఆర్ఐ కోటేశ్వరరావు, ఏఎస్ఐ పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

● పెత్తందారులుగా ఉండకూడదు
● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్ల: శ్రీనివాసరావును పలకరిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని



మాచవరం: పిన్నెల్లిలో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, జంగా

మాచవరం, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రజల ఓట్లతో ప్రజాప్రతినిధులైన ప్రతి ఒక్కరూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలేగాని పెత్తందారులుగా ఉండకూడదని, అప్పుడే ప్రజలు హర్షిస్తారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు స్పష్టంచేశారు. శనివారం మాచవరం మండలంలోని పిన్నెల్లి గ్రామంలో పింఛన్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పార్టీ సీనియర్ నాయకులు తాళ్లూరి అమరనాథ్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. వైసీపీ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ 'మీరు చేసిన తప్పులు మేం చేయాలా?, మీరు రెచ్చగొడితే మేం రెచ్చి పోవాలా?, మీరు వచ్చేది లేదు, చచ్చేది లేదు. మిమ్మల్ని బతకమని చెబున్నాం.' అంటూ ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. ప్రతి కార్యకర్తకు టీడీపీ సమాజంలో గౌరవం పెంచేలా చంద్రబాబు పాలన ఉంటుందన్నారు. పిన్నెల్లిలో టీడీపీ హయాంలో చేపట్టిన.. చేపట్టబోయే అభివృద్ధి పనులను ఆయన వివరించారు. జగన్ వద్దకు వెళ్లి ఫోటోలు దిగటంకాదని, గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. టీటీడీ బోర్డు మెంబరు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ టీడీపీ వల్ల బడుగు, బలహీనవర్గాలకు అనేక రకాలుగా ఉపయోగాలు ఉయన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పింఛనుదారుల్లో ముందస్తు ఆనందం

ఒకరోజు ముందుగానే పింఛను నగదు ఇవ్వడం ద్వారా పింఛనుదారుల్లో ఆనందం వెల్లివిరుస్తుందని ఎమ్మెల్యే యరపతినేని పేర్కొన్నారు. జూన్ 1 ఆదివారం కావడంతో మే 31నే పింఛను ఇవ్వటం సీఎం చంద్రబాబుకే చెల్లుతుందన్నారు. పిన్నెల్లిలో 1,220మంది లబ్ధిదారులకు రూ.52.93 లక్షలు పంపిణీ చేస్తున్నామన్నారు.

ఒంటరి మహిళ సొంతింటి కల నెరవేరుస్తాం

ఒంటరి మహిళ సొంతింటి కల నెరవేరుస్తానని ఎమ్మెల్యే యరపతినేని హామీ ఇచ్చారు. పిన్నెల్లిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన ఆయన గ్రామంలోని గంగిరెడ్డిపాటి రసూల్‌బీ అనే ఒంటరి మహిళకు పింఛన్ ఇచ్చేందుకు ఆమె గృహంలోకి వెళ్లాడు. పింఛన్ ఇచ్చిన అనంతరం ఆమె ఇంటిని పరిశీలించి.. బాగోగుల అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి గాని, తన సొంత ఖర్చులతో మీకు సొంతింటి కల నెరవేరుస్తానంటూ ఆమెకు హామీ ఇచ్చారు. దీంతో ఆ మహిళ వారికి కృతజ్ఞతలు తెలిపింది.

సాయమందిస్తా.. ఆరోగ్యం జాగ్రత్త

● కార్యకర్తకు యరపతినేని భరోసా

పిడుగురాళ్ల, మే 31(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ఒకటవ వార్డుకు చెందిన నంద్యాల శ్రీనివాసరావు లివర్ వ్యాధితో బాధపడుతూ శనివారం పట్టణ టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును కలిసేందుకు ఆటోలో వచ్చాడు. పింఛన్ల పంపిణీ అనంతరం కార్యాలయం నుండి బయటకు వస్తున్న యరపతినేని, శ్రీనివాసరావును గమనించి ఆరోగ్య విషయమై ఆరా తీశారు. కొంత నగదుసాయం అందిస్తానని, గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులతో మాట్లాడి వైద్యం చేయిస్తానని యరపతినేని భరోసా ఇచ్చారు.

పశు పోషణ చేపట్టాలి..

సత్తెనపల్లి రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంతో పాటు పశు పోషణను చేపట్టడం వల్ల మరింత స్థిరమైన ఆదాయం లభిస్తుందని లాంఫాం శాస్త్రవేత్త గంగాదేవి అన్నారు. కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని కంటెపూడి, గుడిపూడి, నందిగామ, గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కేంద్రప్రభుత్వ ప్రాయోజిత ప్రీ ఖరీఫ్ సిద్ధత ప్రచార కార్యక్రమంలో 421 మంది రైతులు కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతలను తెలుసుకున్నారు. ఈనామ్ పోర్టల్ వినియోగం, కిసాన్ సారథి ట్రోల్ ఫ్రీ నెంబరు గురించి శాస్త్రవేత్త సౌజన్య లక్ష్మి రైతులకు తెలిపారు. ఆయిల్‌పాం సాగు అవకాశాల గురించి, అందుబాటులో ఉన్న సబ్సిడీ వివరాలను, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పాం రీసెర్చ్ సెంటర్‌కు చెందిన డాక్టర్ శివశంకర్ రైతులకు తెలిపారు. అనంతరం రైతులకు సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏడీఏ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌరు హక్కులను కాపాడుకోవాలి

పెదకూరపాడు, మే 31(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని తహసీల్దార్ ధనలక్ష్మి అన్నారు. మండలంలోని ముస్సాపురంలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్ఐ గిరిబాబు తదితరులు ప్రసంగించారు.

రేషన్ షాపుల్లో ధరల పట్టిక ఏర్పాటు చేయాలి

బెల్లంకొండ, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని జూన్ 1వ తేదీ నుంచి షాపుల వద్దే రేషన్ పంపిణీ చేస్తారని తహసీల్దార్ ఆస్రిఫున్నీసాతెలిపారు. షాపుల వద్ద ధరలపట్టికను ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. శనివారం బెల్లంకొండ తహసీల్దార్ కార్యాలయం రేషన్ డీలర్లకు సమావేశం ఏర్పాటుచేశారు.

తహసీల్దారు భవానీశంకర్ సేవలు అభినందనీయం



తహసీల్దార్ భవానీశంకర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ముప్పాళ్ళ మే 31 (ఆంధ్రజ్యోతి): నలభై ఏళ్ల ఉద్యోగ జీవితంలో వివాదరహితునిగా తహసీల్దార్ మదమంచి భవానీశంకర్ ప్రజలకు ఉత్తమ సేవలందించారని డిప్యూటీ కలెక్టర్ రాధామోహన్ అన్నారు. ముప్పాళ్ళ తహసీల్దార్ ఎం.భవానీశంకర్ ఉద్యోగవిరమణ సందర్భంగా శనివారం సన్మానసభ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు, గురజాల, సత్తెనపల్లి, నరసరావుపేట ఆర్డీఓలు మురళీకృష్ణ, రమణకాంత్‌రెడ్డిలు భవానీశంకర్ ఆయన సతీమణి పద్మావతిలను ఘనంగా సన్మానించారు. మండలంలోని పలు శాఖల అధికారులు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, నాయకులు భవానీశంకర్ దంపతులను ఘనంగా సన్మానించారు.

పచ్చిరొట్టతో నీటి నిల్వ శాతం పెంపు

● ఎంపీపీ సునీతాశంకర్

దుర్గి, మే 31(ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట విత్తనాలతో భూమిలో నీటి నిల్వ శాతం పెరుగుతుందని ఎంపీపీ సునీతాశంకర్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో ఎంపీపీ మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లింగా రమేష్, ఏవో అమీర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు 'స్నేహ హస్తాలు' సాయం

అచ్చంపేట, మే 31(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట పోలీసుస్టేషన్ వద్ద శనివారం బొల్లాపల్లి మండలం గంగులపాలెం గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు మద్దినేని శిరీష, మద్దినేని భానుతేజకు స్నేహ హస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.1.20 లక్షల చెక్కులను సీఐ శ్రీనివాసరావు వారికి అందజేశారు. విద్యార్థుల్లో ఒకరికి తండ్రి, ఒకరికి తల్లి చనిపోవటంతో ఆర్థికంగా సహాయం అందించారు. భద్రయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై దాణా అందజేత

అచ్చంపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పశువుల ఆస్పత్రి వద్ద శనివారం 50 శాతం సబ్సిడీపై పాడి రైతులకు పశువుల దాణాను అందజేశారు. ఎంపీపీ భూక్యా స్వరమ్మ బాయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వెటర్నరీ డాక్టర్ పి.స్వాతిదేవి మాట్లాడుతూ మండలంలో తొలి విడతగా 180 బస్తాలు వచ్చాయని తెలిపారు. గ్రామాల వారీగా అందిస్తామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, సర్పంచ్ షేక్ జానీ, రాయిడి సాంబశివుడు, ఎనిగండ్ల కోటయ్య, సువర్ణ కుమారి పాల్గొన్నారు.

రేపటి నుంచి బియ్యం పంపిణీ

అచ్చంపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): చౌక ధరల దుకాణాల వద్ద బియ్యం కార్డుదారులకు బియ్యం అందిస్తున్నట్లు తహసీల్దార్ జి.శ్రీనివాస్ తెలిపారు. మండలంలో 50 చౌకదుకాణాలు ఉన్నాయని, మండలానికి మూడువేల క్వింటాళ్ల బియ్యం వచ్చాయని తెలిపారు.

మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెన్షన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రజల సౌకర్యార్థం మౌలికవసతులు కల్పన లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శనివారంమండలంలోని లింగాపురంలో రూ40లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, సైడు కాల్వలను ఆయన ప్రారంభించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను పంపిణీచేశారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ పాలనలో రహదారుల అభివృద్ధికి తట్టెడు మట్టికూడా వేయకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఎంపీడీఓ పార్వతి, పీఆర్ డీఈ వాణీనాథ్, ఏఈ రమేష్‌తో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరము లింగాపురంలో నూతనంగా నిర్మించిన పౌలు లూథరన్ చర్చి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని సంఘస్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

నూతన ఉత్తేజంతో తెలుగుదేశం శ్రేణులు

బెల్లంకొండ, మే 31(ఆంధ్రజ్యోతి): టీడీపీ మహానాడు విజయవంతం కావటంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం నెలకొందని గుంటూ రు మిర్చియార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబ శివారెడ్డి పేర్కొన్నారు. శనివారం బెల్లంకొండ పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ప్రధానకార్యదర్శి మస్తాన్‌షరీఫ్‌తో కలసి ఏర్పాటుచేసిన సమావేశంలో సాంబశివారెడ్డి మాట్లాడుతూ మహానాడు వేదికపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తీసుకున్న తీర్మానా లు, విధాన నిర్ణయాలు రాష్ట్ర ప్రజలను బాగా ఆకర్షించాయన్నారు. మండల పార్టీ నాయకులు గుడిసె కొండయ్య, తమ్మిశెట్టి సత్యనారాయణ, సర్పంచ్ జ్యోతి సముద్రం, రజాక్, తెలుగు యువత నాయకులు ఉన్నారు.

విద్య ద్వారానే అభివృద్ధి

● టీటీడీ బోర్డు మెంబరు జంగా కృష్ణమూర్తి



టైలర్స్‌ను సన్మానం చేస్తున్న టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగాల కార్మికులు ఐక్యంగా ఉండాలని, విద్య ద్వారానే అభివృద్ధిని సాధిస్తామని పల్నాడు బలహీన వర్గాల ఐక్య వేదిక గౌరవ అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం రాత్రి నారాయణపురంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో పల్నాడు బలహీన వర్గాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శ్రమ జీవుల మాసం మే నెల సందర్భంగా చమటోర్చి నిజాయితీగా పని చేస్తున్న వివిధ రంగాల్లో ఉన్న కార్మికులకు ఒకే వేదిక పైకి తీసుకు వచ్చి సన్మాన కార్యక్రమం చేశారు. కార్యక్రమానికి దాచేపల్లి నగర పంచాయతీ 14వ వార్డు కౌన్సిలర్ షరీఫ్ అధ్యక్షత వహించారు. అనంతరం చేతి వృత్తుల్లో వివిధ రంగాల్లో ఉన్న 200మంది కార్మికులకు శాలువా కప్పి మెమెంటో బహూకరించి సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, గద్దల వేదమణి, మాజీ ఎంపీటీసీ జక్కా అనంత రామయ్య, మౌలానా ముస్తఫా, ఫారూక్ మౌలానా, మద్దికుంట రామకృష్ణ, షేక్ సిలార్, మునీందర్‌రెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణే లక్ష్యంగా వాహన తనిఖీలు

అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నందున రవాణా, పోలీసు, ఆర్టీసీ అధికారుల జాయింట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అమరావతిలోని బస్టాండ్ సెంటర్‌లో వాహనాల తనిఖీలు నిర్వహించింది. పరిమితికి మించి ప్రయాణం చేస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. 80వాహనాలు తనిఖీ చేయగా వాటిలో 36 వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఐదు వాహనలను భద్రత నిమిత్తం స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. రూ.80,600 ఫైన్ వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. తనిఖీలలో సీఐ అచ్చయ్య, ఎస్ఐ కె.అమీర్, సహాయ వాహన తనిఖీ అధికారి ఎం.సురేష్‌బాబు ఆర్టీసీ డీఎంతో పాటు ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని కాపాడాలి

క్రోసూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యాన్ని కాపాడాలని కోరుతూ భారీ జాతీయ జెండాతో సీపీఎం నాయకులు శనివారం క్రోసూరులో సమైక్యత ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పలువురు సీపీఎం జిల్లా నాయకులు పాల్గొన్నారు. వై రాధాకృష్ణ, ఏపూరి గోపాలరావు, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, గంజిమాల రవిబాబు, తిమ్మిశెట్టి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల దృష్టికి తెచ్చి ఉద్యమించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు బైరాపట్నం రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం ఆయన క్రోసూరులో విలేకరులతో మాట్లాడారు. మారుతీ వరప్రసాదు, చెన్నకేశవ, పి.నాగేశ్వరరావు, వెంకటరావు పాల్గొన్నారు.

పింఛన్‌ల పంపిణీ

బెల్లంకొండ, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని న్యూ చిట్యాల ఆర్అండ్ఆర్ సెంటర్‌లో శనివారం ఉదయం గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బెల్లంకొండ నాగిరెడ్డిపాలెం గ్రామంలో పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ హనుమంతరావు నాయక్, తెలుగు మహిళా అధ్యక్షురాలు నాగమణి బాయి, వెన్నా సీతారామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ తిప్పిరెడ్డి కిచ్చారెడ్డి ఉన్నారు.

ఒక రోజు ముందుగానే...

కారంపూడి, మే 31(ఆంధ్రజ్యోతి): జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో శనివారం రోజున ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ప్రభుత్వ సిబ్బంది పంపిణీ చేశారు. శనివారం ఉదయం 6 గంటలకల్లా పెన్షన్ల పంపిణీలో నిమగ్నమయ్యారు. టీడీపీ కారంపూడి పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణ పాల్గొని పెన్షన్లను అందజేశారు.

పింఛనుదారులకు ప్రభుత్వం అండ

దాచేపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఒక రోజు ముందుగానే సామాజిక పింఛను అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని మాజీ ఎంపీటీసీ తోట వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం దాచేపల్లి నగర పంచాయతీ 11వ వార్డులో ఆయన పింఛను నగదు పంపిణీ చేశారు. వార్డు ఇన్‌చార్జి తిరుమల కుమార్, మహమ్మద్ రఫీ, షేక్ తుల్లా, తోట వెంకట్రామయ్య పాల్గొన్నారు. మండలంలో ఉదయం 6 గంటలనుంచే సచివాలయ, సిబ్బంది పంపిణీ చేశారు.

సబ్ జైలును తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి



సబ్ జైలులోని ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వి.విజయ కుమార్‌రెడ్డి

సత్తెనపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌జైలును సీనియర్ సివిల్ జడ్జి వి.విజయ కుమార్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. సబ్‌జైలు పరిసరాలను, రిజిస్టర్లను పరిశీలించారు. అక్కడ రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలకు అందుతున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. నిందితులతో మాట్లాడారు. చట్టపరంగా ఉచితంగా న్యాయసహాయం కూడా అందిస్తామని తెలిపారు. ఆయనతో పాటు న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు, లీగల్ వాలంటీర్ సుభానీ, సబ్ జైలు సూపరింటెండెంట్ వెంకట రత్నం ఉన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజా వేదిక

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజావేదికను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం తన కార్యాలయంలో నియోజక వర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి సమస్యలపై ఆయన వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు. సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాలు జారీ చేశారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 29వ వార్డులో శనివారం ఇంటింటికి తిరిగి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌లను ఆయన పంపిణీ చేశారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామ స్వామి, నియోజక వర్గ పరిశీలకులు తాత జయ ప్రకాష్ నారాయణ, మునిసిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్, నాయకులు ఉన్నారు.

పింఛన్ల పంపిణీ

సత్తెనపల్లి రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో సామాజిక భద్రత పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం శనివారం పండుగ వాతావరణంలో జరిగింది. మండలంలో 10,502 మంది పింఛన్‌లు ఉండగా 9,694 మందికి పింఛన్‌లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు.

రేపటి నుంచి రేషన్ పంపిణీ

రేషన్ దుకాణాల్లోని కార్డుదారులకు సోమవారం నుంచి సరుకులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీలర్లు ప్రభుత్వ నియమ నిబంధనలు పాటిస్తూ కార్డుదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలన్నారు. రేషన్ షాపులు స్టాక్ బోర్డు ఉంచాలని, కోవిడ్ నియమ నిబంధనలు పాటించాలని డీలర్లకు సూచించారు.

ప్రత్యామ్నాయ పంటల పై శిక్షణ



మాట్లాడుతున్న అనిల్ కుమార్

రాజుపాలెం, మే31(ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామంలో గుంటూరుకు చెందిన కృషి విజ్ఞాన కేంద్రం లాంఫాం ఆధ్వర్యంలో శనివారం కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సస్యరక్షణ శాస్త్రవేత్త మోడల్ అధికారి అనిల్ కుమార్ వివిధ అంశాలపై రైతులతో చర్చించారు. ఐసీఏఆర్-110పి పెదవేగి ప్రధాన శాస్త్రవేత్త రవిచంద్రన్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ గురించి, వివరించారు. జిల్లా డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నాగేష్, వ్యవసాయశాఖ అధికారి వెంకటనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టం ముందు అందరూ సమానులే..

రాజుపాలెం, మే31(ఆంధ్రజ్యోతి): సమాజంలో నివసించే వారందరూ సమానులే అని తహసీల్దార్ దుర్గేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని రాజుపాలెం గ్రామంలో ఉన్న ఇందిరా జయంతి కాలనీలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దారు దుర్గేశ్వరరావు పాల్గొన్నారు. ఎస్సై వేణుగోపాల్, డిప్యూటీ తహశీల్దార్ జానిబాషా, ఆర్ఐ గోపి తదితరులు ఉన్నారు.

ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌లు అందజేత

అచ్చంపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక భద్రత, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయమని, అందుకనే ఒక రోజు ముందుగానే ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌లను పంపిణీ చేసినట్లు టీడీపీ మండలాధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం తెలిపారు.

లైఫ్ ఇన్సూరెన్స్ ప్యానల్ న్యాయవాదిగా చిన్నం

సత్తెనపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణ లైఫ్ ఇన్సూరెన్స్ ప్యానల్ న్యాయవాదిగా చిన్నం మణిబాబు నియమితులయ్యారు. శనివారం ఎల్‌ఐసీ అధికారులు మణిబాబును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

5న జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

సత్తెనపల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న పల్నాడు జిల్లా సబ్‌జూనియర్స్ అండ్ జూనియర్స్ బాలబాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక సత్తెనపల్లిలోని సుగాలీకాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కే సుబ్రహ్మణ్యేశ్వరరావు శనివారం విలేకరులకు తెలిపారు. పూర్తి వివరాలను 73969 67776 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

రాజధానిలో రహదారుల
పనులు ముమ్మరం



ఎన్‌- 9 రోడ్డులో చదును చేస్తున్న రోలర్

గుంటూరు, మే 31(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రహదారుల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రస్తుత సచివాలయం మొదలు హైకోర్టు, న్యాయమూర్తుల నివాసాలు, మంత్రుల ఆవాసాలు, ఐకానిక్ భవన సముదాయాలను కలిపే రోడ్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రధాని మోదీ లాంఛనంగా పనులు ప్రారంభించడానికి ముందే మౌలిక సదుపాయాలు కల్పించుకున్న కాంట్రాక్టు సంస్థలు ఆ తరువాత పనుల్లో వేగం పెంచాయి.

● వేగంగా ఎన్ సిరీస్ రోడ్ల పనులు

రాజధానిలో అత్యంత కీలకమైన ఐకానిక్ టవర్స్, అసెంబ్లీ, శాశ్వత హైకోర్టు, సచివాలయ భవన సముదాయాలు, మంత్రులు, న్యాయమూర్తుల గృహ సముదాయాలను కలిపే ఎన్ 11, ఎన్ 10 రోడ్ల పనులు జోరుగా సాగుతున్నాయి. ఎన్ 11 రోడ్డులో గతంలో ఆగిపోయిన అండర్ గ్రౌండ్ డ్రెయిన్ల నిర్మాణ పనులను పది హేను రోజులుగా కొనసాగిస్తున్నారు. దాంతోపాటు ముఖ్యమంత్రి నివాసానికి అత్యంత సమీపంలో ఉండే ఎన్ 10 రోడ్డులో కూడా పనులు మొదలయ్యాయి. ఎన్ 12, 9 రోడ్లలో కూడా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు జరుగుతున్నాయి. కృష్ణయ్యపాలెం, ఎర్రబాలెం సమీపంలో ఎన్ 3 రోడ్డు పనులకు కూడా శ్రీకారం చుట్టారు.

- తొలి దశలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ
- శరవేగంగా అరడజనుకు పైగా రోడ్ల నిర్మాణం
- తుది దశకు వెస్ట్ బైపాస్ పెండింగ్ వర్కులు
- త్వరలో మరిన్ని రోడ్ల పనులు ప్రారంభం
- అకాల వర్షాలతో అనుకోని ఆటంకాలు
- నీరు తోడుకుంటూ పనులను సాగిస్తున్న పరిస్థితి

ప్రస్తుత సచివాలయం వెనుక భాగం నుంచి వెళ్లే ఎన్ 9 రోడ్డు మల్కాపురం క్రాస్‌రోడ్డు దగ్గర ఈ 4 రోడ్డును కలుస్తుంది. అక్కడ కూడా ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న 3 లేన్లను మరింత విస్తరిస్తున్నారు.

ఈ-సిరీస్ రోడ్ల పనులు పరుగులు

రాజధాని నిర్మాణంలో తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపే ఈ సిరీస్ రోడ్ల పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. సీడ్ యాక్సిస్ రోడ్డు (ఈ- 3) రోడ్డును కూడా మరింత విస్తరిస్తున్నారు. తుళ్లూరు వద్ద చర్చి నిర్మాణాన్ని పక్కకు జరిపి అక్కడ కూడా పనులు పూర్తి చేశారు. ఈ -4, ఈ-5 రోడ్లతో పాటు సీఎం చంద్రబాబు ఇంటి ముందు నుంచి వెళ్లే ఈ-6 రోడ్డు పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఈ రోడ్లతోపాటు రాజధానిని అనుసంధానించే వెస్ట్ బైపాస్ రోడ్డు పనులు కూడా తుది దశకు చేరాయి. ఇప్పటికే కృష్ణా నదిపై నిర్మిస్తున్న వారధి నిర్మాణం పూర్తికాగా, అరకొరగా ఉన్న మిగిలిన పనులు కూడా చివరి దశకు చేరాయి. దీంతో ఆ రోడ్డు కూడా త్వరలో అందుబాటులోకి రానుంది.

● అకాల వర్షాలతో ఆటంకాలు..

మే నెల మొత్తం వర్షాలతోనే గడిచిపోయింది. గడిచిన రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలు రోడ్ల నిర్మాణ పనులకు ఇబ్బందులు తెచ్చిపెట్టాయి. రోడ్ల నిర్మాణంలో భాగంగా మొదలు పెట్టిన అండగర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు వానల కారణంగా మందగించాయి. డ్రెయినేజీ కోసం తీసిన గుంతల్లో నీరు నిండిపోవడంతో పనులు ఆగిపోతున్నాయి. ఏ రోజుకారోజు నీటిని తోడుతున్నా తిరిగి గుంతల్లో నీరు చేరుతుండడంతో పనులు మందకొడిగా సాగుతున్నాయి.



ఎన్‌- 9, ఈ -4 జంక్షన్లో అదనపు వంతెన నిర్మాణ పనుల్లో ఉన్న కార్మికులు



అద్దిస్ అబాబాలో పర్యటిస్తున్న అఖిలపక్ష బృందం సభ్యులు సుప్రియా సూలే, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

'సిందూర్' ఆవశ్యకతను వివరించిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌ను వివరించేందుకు భారత అఖిలపక్ష బృందం ప్రపంచ దేశాల పర్యటనలో ఉంది. దీనిలో భాగంగా ఇథియోపియా దేశ రాజధాని అద్దిస్ అబాబాలో సుప్రియా సూలే నేతృత్వంలో అఖిలపక్షం బృందం శనివారం పర్యటించింది. ఇథియోపియా మాజీ ప్రధాని హైలేమరియం డెస్సాలెగ్న్‌తో బృందం భేటీ అయ్యింది. ఈ బృందంలో ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, రాజీవ్ ప్రతాప్ రూడీ, మనీస్ తివారీ, అనురాగ్ సింగ్, ఠాకూర్, విక్రమ్‌జీత్ సింగ్, ఆనంద్‌శర్మ, వి.మురళీధరన్, ఐక్యరాజ్య సమితికి భారత దేశ మాజీ శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్ ఉన్నారు.

పోలికలే.. పసి ప్రాయానికి ప్రమాదం

(5వ పేజీ తరువాయి)

గురువుతున్నారు. దీంతో ముఖ్యమైన కౌమార దశ తీవ్ర ఒత్తిడిలో నలిగిపోతోంది.

స్పష్టత లేని లక్ష్యం..

సమాజంలో నిలిచే ప్రతి విజయం తమ ఇంట్లోనే జరగాలనే భావన కొత్తగా ప్రతి ఒక్కరిలో మొదలైంది. ఇది ఒక్క క్రీడల్లోనే కాదు.. అన్ని విషయాల్లోనూ ఇలానే జరుగుతోంది. ఒక విద్యార్థి ఐఐటీలో ర్యాంకు సాధించినా, రూ.లక్షల వేతనంతో ఉద్యోగం పొందినా.. ఆఖరికి యూట్యూబ్ వీడియోలతో ఫేమస్ అయినా.. మీరు కూడా అలా చేయండి అంటూ పిల్లలపై తల్లిదండ్రులు ఒత్తిడి తెస్తున్నారు. అంతేగాక తాము జీవితంలో కోల్పోయింది.. తమ పిల్లలు సాధించాలని అనుకుంటూ ఉంటారు. కాకపోతే ఏ రంగంలో రాణించాలో సరైన నిర్దేశం చేయలేకపోతున్నారు. ఏదో ఒకటి సాధించాలని చెబుతున్నారే కానీ, అది ఏంటి అనేది స్పష్టంగా పిల్లలకు చెప్పలేకపోతున్నారు.

> గుంటూరులోని పట్టాభిపురానికి చెందిన ఓ విద్యార్థిని పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 560 మార్కులు సాధించింది. తమ పిల్లలకు ఈ మార్కులు వస్తే ఏ తల్లిదండ్రులైనా ఎగిరి గంతేస్తారు. కానీ, విద్యార్థినిని తక్కువ మార్కులు వచ్చాయని తండ్రి మందలించాడు. దీంతో ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది.

తల్లిదండ్రుల పాత్రే కీలకం

పిల్లలు సాధించిన విజయాల్లో తల్లిదండ్రుల పాత్రే కీలకం. చాలా మంది తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించలేకపోతున్నారు. విజేతల కథలను స్ఫూర్తి పొంది.. తాము ఎంచుకున్న రంగాల్లో రాణించాలని పిల్లలకు చెప్పాలి. కానీ, వారి ఆసక్తిని గమనించకుండా ఆయా రంగాల్లోకి వెళ్లి విజయాలు సాధించమంటే ఎంతవరకు సాధ్యమవుతుందో ఆలోచన చేయాల్సిన అవసరం చాలా ఉంది.

చులకన చేయొద్దు..

పరీక్షల ఫలితాల్లో 99 శాతం ఉత్తీర్ణత సాధించినా.. ఆ ఒక్క శాతం ఎందుకు వదిలేశావని పిల్లలను ప్రశ్నించే తల్లిదండ్రులు సమాజంలో చాలామందే ఉన్నారు. అంతటితో ఆగక.. ఖర్చుల లెక్క బయటకు తీస్తారు. ఇంకెవరినో ఉదాహరణగా చూపుతూ చులకన చేస్తారు. దీనినే విశ్వామిత్ర పెంపకం అంటారు. ప్రస్తుతం 50 శాతం పైన తల్లిదండ్రులు ఇదే పెంపకాన్ని అనుసరిస్తున్నారని విశ్లేషకులు చెబుతున్నారు.

కౌమర దశ కీలకం...మానసిక వ్యాధి ప్రమాదం

కౌమర దశ చేరుకునే పిల్లల్లో అనేక సందేహాలు తలెత్తుతుంటాయి. వాటి నివృత్తికి తల్లిదండ్రులే చొరవ చూపాలి. అనుమానాలను, వారిలో ఉండే మానసిక సమస్యలను గుర్తించి పరిష్కరించాలి. ఒత్తిడి తట్టుకోలేక ఈ మధ్య యువత సెబ్లింగ్ రైవలరీ అనే మానసిక వ్యాధి బారిన పడుతున్నారు. ఈ వ్యాధి బారిన పడినవారు.. ఒక దశలో తల్లిదండ్రులు చెప్పినవన్ని సాధించినట్లు వారిలో వారే మాట్లాడుకుంటూ ఉంటారు. గొప్పవాళ్లం అయ్యామని అనుకుని చేతులు ఊపడం, ఆటో గ్రాఫ్‌లు ఇవ్వడం వంటివి చేస్తుంటారు. ఈ వ్యాధిని తొలిదశలో గుర్తించలేకపోతే కొంత కాలం తర్వాత పిచ్చివాళ్లుగా మారే ప్రమాదముంటుందని మానసిక వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పెరుగుతున్న ఆత్మహత్యలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాలుగేళ్లలో దాదాపు 220 మంది ఆత్మహత్యలు చేసుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. స్మార్ట్‌ఫోన్లు ఎక్కువగా వీక్షించడం. ఒంటరితనం, మానసిక ఒత్తిడి వంటి కారణాలతో యువత బలవన్మరణాలకు పాల్పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

పోలికలతోనే ప్రమాదం

పిల్లలను నేరుగా తిడితే వారికి భరించే శక్తి ఉంటుంది. కానీ, ఇతరులతో పోల్చుతూ మాట్లాడితే మాత్రం తీవ్ర మానసిక ఒత్తిడిని అనుభవిస్తున్నారు. ఆ సమయంలో వారికి ఆత్మహత్య చేసుకోవాలనేంత బాధగా ఉంటుంది. 'మీ పిల్లవాడు వృద్ధిలోకి రాలేక పోతున్నాడు.' అన్న బంధువులు మాటలకు వారికి సమాధానం చెప్పలేక.. ఇంటికి వచ్చి పిల్లలనే తిట్టే తల్లిదండ్రులే ప్రస్తుతం ఎక్కువ. స్వతంత్ర నిర్ణయాలు తీసుకుంటారుగాని.. వాటి అమల్లో మాత్రం మధ్య తరగతి మనస్తత్వం తల్లిదండ్రులకు అడ్డుగా మారుతుంది. చివరికి దుస్తుల విషయంలో కూడా ఎదురింటి వారిని, పక్కింటి వారిని అనుసరిస్తూంటారు. చదువులో కూడా ఎదురింటి పిల్లలు ఎక్కడ చదివితే అక్కడే చదివిస్తుంటారు.

పిల్లల పెంపకంలో పెరిగిన వ్యత్యాసాలు

పిల్లల పెంపకంలో 2005 నాటికి, అంతకు ముందు తల్లిదండ్రులకు ఎంతో వ్యత్యాసం ఉందని మానసిక నిపుణులు చెబుతున్నారు. వృత్తి, ఉద్యోగంలో మరింత ఉన్నతంగా రాణించేలా నాటితరం తల్లిదండ్రుల పెంపకం ఉండేదని, ప్రస్తుతం భిన్నంగా ఉందని అంటున్నారు. 2005 తర్వాత పుట్టిన పిల్లలకు కౌమారం వచ్చే నాటికి నిర్దిష్టమైన లక్ష్యాలు లేవు. పూర్తి యాంత్రిక జీవితంలో తల్లిదండ్రులు ఉండటం వల్ల.. ప్రస్తుత ప్రపంచంలో ఎక్కడ వెనుకబడిపోతారో అనే ఆందోళనతో ఒకటి కంటే ఎక్కువ లక్ష్యాలను వారి ముందు ఉంచుతున్నారు.

దీర్ఘకాలిక శిక్షణతోనే విజయాలు : జీవీఎస్ ప్రసాదు, అథ్లెటిక్ కోచ్, గుంటూరు



ఏ రంగంలోనైనా.. దీర్ఘకాలిక శిక్షణ, కఠోర శ్రమతోనే పిల్లలు రాణిస్తారనే అనే విష యాన్ని తల్లిదండ్రులు గుర్తించాలి. ముఖ్యంగా పిల్లల ఆసక్తిని గమనించాలి. పతకాల మాట అటుంచితే ప్రతి ఒక్కరూ ఆటలపై శ్రద్ధ చూపాలి. మంచి క్రీడాకారులు శారీరక దృఢత్వంతో పాటు మంచి పౌరులుగా రాణిస్తారు.


పిల్లల ఆసక్తిని గమనించాలి : డాక్టర్ వి.వెంకట కిరణ్, మానసిక వైద్య నిపుణులు, జీజీహెచ్



స్మార్ట్ ఫోన్, చౌక ధరలో ఇంటర్నెట్ వచ్చిన తర్వాత రాత్రికి రాత్రే చాలామంది ఫేమస్ అవుతున్నారు. వీటిలో ఎక్కువ శాతం తాత్కాలికమే. దీనిని గుర్తించలేక చాలమంది తల్లిదండ్రులు తమ పిల్లలపై ఒత్తిడి తెస్తుంటారు. ఇది మంచి పద్దతి కాదు. 8 ఏళ్ల దాటిన తర్వాత పిల్లల ఆసక్తిని గమనించడం కష్టమేమికాదు. దానిని గుర్తించి చదువుతోపాటు,ఆ రంగంలో శిక్షణ ఇప్పించాలి.

వ్యవసాయశాఖలో.. బదిలీలలు

- మాజీ మంత్రి దగ్గర బంధువుకు ఐదు సిఫార్సు లేఖలు
- కీలక స్థానాలన్నీ వైసీపీ అధికార గణానికే
- చక్రం తిప్పుతున్న కమిషనరేట్ అధికారులు



గుంటూరు సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరు జిల్లాకు చెందిన నేతకు కీలకమైన మంత్రి పదవి దక్కింది. నెల్లూరు వ్యవసాయశాఖలో పనిచేస్తున్న తన బంధువులను ఆగమేఘాల మీద గుంటూరుకు తెచ్చేందుకు ఇక్కడ పనిచేస్తున్న ఇద్దరు ఏఓ (వ్యవ సాయ అధికారులు)లను తిరుపతి సరిహద్దుల్లోకి తీసుకెళ్లి పడేశారు. అప్పటి నుంచి సదరు అధికారులు జిల్లా కేంద్రానికి దగ్గరలో బాగా ఆదాయం వచ్చే పోస్టు ల్లో పనిచేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉంది. వాస్తవానికి అప్పట్లో అంత దౌర్జన్యంగా పోస్టుల్లోకి వచ్చిన వారు వేరే ప్రాంతాలకు వెళ్లాలి. కానీ, విచిత్రంగా అదే అధికారులను కోరుకున్న చోట నియమించమంటూ సిఫార్సు లేఖలు ఇబ్బదిముబ్బడిగా వచ్చాయి. వారిలో ఒక అధికారి ఏకంగా ఐదు సిఫార్సు లేఖలను తీసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

జోన్-3లో భ్రష్టు పట్టిన బదిలీ ప్రక్రియ

జోన్-3లోని మండల వ్యవసాయ అధికారుల బదిలీ ప్రక్రియ పూర్తిగా భ్రష్టు పట్టింది. కమిషనరేట్ లోని ఇద్దరు కీలక అధికారులు మొత్తం బదిలీలను కలుషితం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని కీలకమైన స్థానాల్లో వైసీపీ నేతల బంధువులకు, ముఖ్య అనుచర గణానికే దక్కేలా చేశారన్న వాదన సర్వత్రా వినిపిస్తోంది.

చెల్లని టీడీపీ ఎమ్మెల్యేల లేఖలు..

వైసీపీకి అనుకూలంగా ఉన్న వ్యవసాయ అధికారులను కీలకమైన పోస్టుల్లో కూర్చోబెట్టేందుకు ఎంపీ, ఎమ్మెల్యేల లేఖలను అధికారులు పరిగణలోకి తీసుకున్నారు. టీడీపీకి అనుకూలంగా ఉన్న అధికారుల విషయంలో మాత్రం ఈ సిఫార్సు లేఖలను బుట్టదాఖలు చేశారు. గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఇచ్చిన లేఖలను ఒక అధికారి కంటితో చూసేందుకు కూడా ఇష్టపడలేదని చెబుతున్నారు. సాక్షాత్తు ఎమ్మెల్యే ఫోన్ చేసి ఫలానా మహిళా అధికారి తమకు అవసరం లేదని చెప్పి నా.. ఆమెను అక్కడే ఉంచే విధంగా జాబితా తయారు చేశారు. పల్నాడు జిల్లాలోని ఒక నియోజక వర్గంలో పనిచేస్తున్న ఏఓ గత నాలుగు సంవత్సరాల నుండి అక్కడ పనిచేస్తూ.. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే కోసం ఎన్నికల్లో తీవ్రంగా పనిచేశారు. ఆ పోస్టు కోసం టీడీపీకి మద్దతుగా ఉన్న బీసీ వర్గానికి చెందిన ఏఓ దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు అక్కడ పోస్టింగ్ ఇవ్వాలని ముఖ్య నేతలు సిఫార్సు చేసినా.. వైసీపీ నేత కోసం రాత్రింబవళ్లు కష్టపడిన ఏఓకే కమిషనరేట్‌లోని అధికారులు లైన్ క్లియర్ చేశారు. చేసేది లేక బీసీ వర్గానికి చెందిన ఏఓ నరసరావుపేటకు మారినట్లు తెలుస్తోంది.

జిల్లా కేంద్రంలో కీలక స్థానాల్లో...

గుంటూరు జిల్లా కేంద్రంలో చాలా ఏఓ పోస్టులు వివిధ విభాగాల్లో ఉన్నాయి. వాటన్నిటిల్లో గడచిన ఆరేళ్లగా వైసీపీ నేతల సిఫార్సుతో వచ్చిన వాళ్లే ఉన్నారు. ప్రస్తుత బదిలీల్లో వాళ్లకు స్థాన చలనం ఉంటుందని అందరూ భావించారు. కానీ ఒక్కరిని కూడా ఆయా పోస్టుల నుంచి కదిలించలేదు. అసోసియేషన్ పేరుతో అదే పోస్టుల్లో కొనసాగేందుకు ప్రణాళిక రచించారు. పెదనందిపాడు మండలం కీలకంగా వ్యవహరించే కొందరు వైసీపీ నేతల బంధువు గత ప్రభుత్వం నుంచి జిల్లా కేంద్రంలో కీలక స్థానం లో కొనసాగుతున్నారు. ఆయనపై డీలర్లు కూడా పలు ఆరోపణలు చేస్తున్నా.. సదరు ఏఓ కోసం గతంలో ఇక్కడ పనిచేసి పీకల్లోతు అవినీతిలో కూరుకు పోయిన ఒక మహిళా అధికారి కమిషనరేట్లో చక్రం తిప్పినట్లు చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అసోసియేషన్ పేరు తో అనేక మంది పాత స్థానంలోనే పాతుకు పోయినట్లు చెబుతున్నారు.

ఏడేళ్లు దాటినా అక్కడే

ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన బదిలీల జీఓ ప్రకారం ఒకే స్టేషన్ లో ఐదేళ్లు సర్వీస్ పూర్తి చేసిన వారిని కచ్చితంగా బదిలీ చేయాలి. గుర్తింపు ఉన్న ఉద్యోగుల యూనియన్‌లలో ఉన్నవారికి మాత్రం మినహాయింపు ఉంటుంది. వ్యవసాయ అధికారుల బదిలీలలో ఈ నిబంధనను దుర్వినియో గం చేసినట్లు తెలుస్తోంది. కొందరు వ్యవసాయ అధికారులు ఒకే స్టేషన్‌లో ఏడేళ్ల నుంచి పనిచేస్తున్నా రు. బదిలీల దగ్గరికి వచ్చేటప్పటికి వారి సర్వీస్‌ను ఐదేళ్లు మాత్రమే చూపించారు. ఏకంగా రెండేళ్ల సర్వీస్‌ను ఎగరగొట్టేశారు. ఉద్దేశ్య పూర్వకంగానే జాబితాలో ఇటువంటి పొరపాట్లకు చోటు కల్పించినట్లు తెలుస్తోంది. ఒకరిద్దరు ఏడేళ్లు దాటినా అదే స్థానంలో ఉండెందుకు అసోసియేషన్ పాయిం ట్‌ను వినియోగించారు. అసలు గుర్తింపు లేని కొన్ని అసోసియేషన్ లను ఎలా పరిగణలోకి తీసుకున్నారన్నది ప్రశ్నర్థకంగా మారింది.

పెద్దల పేర్లు చెప్పి వసూళ్లు

వ్యవసాయ శాఖలో జరుగుతున్న బదిలీల పర్వంలో భారీ అవినీతి జరిగినట్లు చెబుతున్నారు. కొంతమంది పెద్దల పేర్లు చెప్పి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దానిపై కొందరు ముఖ్యులు ఆరా తీసి కొందరిపై నిఘా వేసినట్లు చెబుతున్నారు.



కౌంటర్‌లో నిరీక్షిస్తున్న వినియోగదారులు

పార్శిల్‌కు తప్పని నిరీక్షణ

● ఆర్టీసీ కార్గోలో వినియోగదారుల బారులు ● కౌంటర్లు పెంచాలని విజ్ఞప్తి

గుంటూరు, మే 31(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సరుకు రవాణా సంస్థ కార్గో పార్శిల్ డిపాజిట్‌లకు వెళితే వినియోగదారులు గంటల తరబడి పడిగాపులు పడాల్సి పరిస్థితులు ఏర్పడ్డాయి. వస్తువులు పార్శిల్‌కు ఇవ్వాలంటే క్యూలో నిల్చున్న వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఆర్టీసీ కార్గో పార్శిల్ సంస్థలో వివిధ రకాల వస్తువులు నిత్యం పెద్ద ఎత్తున ఎగుమతి, దిగుమతులు అవుతుంటాయి. గతంలో ఆర్టీసీకి అనుబంధంగా ప్రైవేటు సంస్థ ఏఎన్‌ఎల్ పార్శిల్ రవాణా వ్యాపారం నిర్వహించింది. రాష్ట్ర విభజన అనంతరం ఆర్టీసీ సొంతంగా 2016 నుంచి ఆర్టీసీ కార్గో పార్శిల్ సంస్థకు శ్రీకారం చుట్టింది. వస్తువులు ఎక్కడి నుంచి ఎక్కడికైనా 24 గంటల్లో చేరేలా ప్రణా ళికలు రూపొందించింది. వస్తు రవాణా గ్యారంటీ, నమ్మకంతో కూడిన వ్యాపారం కార్గో నిర్వహిస్తోంది. సరుకు రవాణాపై కిలో మీటర్ల దూరం, వస్తువు బరువును బట్టి చార్జీ నిర్ణయిస్తున్నారు.

పెరుగుతున్న ఆదరణ

గుంటూరు ఎన్‌టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో పార్శిల్ రవాణా సంస్థకు నిత్యం ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోంది. ఇక్కడ నుంచి నిత్యం హై దరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, అనంతపూర్ ప్రాంతాలకు పెద్దఎత్తు న సరుకు రవాణా జరుగుతోంది. గత ఆర్థిక సం వత్సరంలో రూ.12.21 కోట్లతో రాష్ట్రంలోనే మూడో స్థానంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కార్గో నిలిచి నట్లు అధికారులు తెలిపారు. ఇలా రోజురోజుకు ఆర్టీసీ కార్గో పార్శిల్‌సంస్థకు వినియోగదారులు ఆదరణ పెరుగుతోంది.

ఆదరణ స్థాయిలో పెరగని కౌంటర్లు

వినియోగదారుల తాకిడికి అనుగుణంగా అధికా రులు మాత్రం ఆ స్థాయిలో కౌంటర్లు పెంచడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శనివారం ఎన్‌టీఆర్ బస్టాండ్ ప్రాంగణంలోని కార్గో సంస్థకు పెద్ద ఎత్తున వినియోగదారులు చేరుకున్నారు. ఈ క్రమం లో రద్దీగా ఉండటంతో ఒక్కొక్కరు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. దాంతో వారంతా అసహనం వ్యక్తం చేశారు. రద్దీ సమయాల్లోనైనా మరో కౌంటర్ ఏర్పాటు చేయాలని పలుమార్లు వినియోగదారులు కోరినప్పటికీ కార్గో అధికారులు పెడ చెవిన పెడుతు న్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారు లు స్పందించి రద్దీ సమయాల్లోనైనా అదనపు కౌం టర్లు ఏర్పాటు చేసి, వినియోగదారుల ఇబ్బందులు తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఈపూరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా రామారావు

ఈపూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): ఈపూరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా రామారావు శనివారం బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన పద్మావతి నూజెండ్ల మండలానికి బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో నూజెండ్ల ఆర్ఐగా పని చేస్తున్న రామారావు బదిలీపై ఈపూరునకు వచ్చారు.

రేషన్ కార్డు దరఖాస్తులు 907

రొంపిచర్ల, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రేషన్ కార్డులకు సంబంధించి 907 దరఖాస్తులు అందినట్టు తహసీల్దార్ బండి నిర్మల శనివారం తెలిపారు. వివిధ రకాల దరఖాస్తులు సంబంధిత వీఆర్‌వోలకు పంపించి వాటిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్టు తెలిపారు. మండలంలో 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల వద్ద సరుకులు తీసుకోవాలని ఆమె వినియోగదారులను కోరారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నరసరావుపేట లీగల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవ శాత్తు టూత్ పేస్ట్ అనుకొని ఎలుకల మందుతో పళ్ళు తోముకుని గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ వివాహిత శుక్రవారం మృతి చెందింది. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పట్టణంలోని శివ సంజీవ కాలనీకి చెందిన తన్నీరు దుర్గ(26) సున్నపు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుంది. మృతురాలి భర్త శ్రీను బేల్దారి పనిచేస్తున్నాడు. మృతురాలికి పిప్పి పళ్ళు ఉండడంతో నొప్పి తగ్గడం కోసం వైద్యుడు ఓ పేస్టు సూచించారు. నొప్పి ఉన్న సమయంలో సదరు పేస్టుతో దంతాలు తోము కోవాల్సిందిగా సూచించారు. ఈ నేపథ్యంలో మే నెల 23వ తేదీ పిప్పి పళ్ళు నొప్పిగా ఉండడంతో డాక్టర్ రాసిన పేస్టు అనుకొని పొరపాటున చీకట్లో ఉన్న ఎలుకల మందు పేస్టుతో పళ్ళు తోముకుంది. కనుగొన్న వెంటనే నర్సారావుపేట ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం వెళ్ళింది. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చింది. మందులు వాడుకుంటూ ఉండగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మే 26వ తేదీ నరసరావుపేటలో చికిత్స పొందు వాంగ్మూలం ఇచ్చింది. నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాల సూచన మేరకు గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ 30వ తేదీ సాయంత్రం చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీ కొని వ్యక్తి మృతి

వినుకొండటౌన్, మే 31. (ఆంధ్రజ్యోతి) ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మార్కాపురం రోడ్డులోని పసుపులేరు బ్రిడ్జి వద్ద శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే పాతప్లాస్టిక్ దుకాణంలో రోజువారీ కూలీగా పనిచేస్తున్న బిహార్‌కు చెందిన అజిత్‌మిశ్రా (41)ను అన్నమయ్య జిల్లాకు చెందిన జీరంగుళ అంజనేయులు ద్విచక్రవాహనంపై తెల్లవారుజామున ఫినాయిల్, చీపురులు అమ్ముకునేందుకు ద్విచక్రవాహనం ప్రమాదవశాత్తు అజిత్ మిశ్రాను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడుని ఢీకొట్టిన ఆంజనేయులు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం నరసరావుపేటకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి బంధువులు ఏవరూలేక పోవడంతో ఫిర్యాదు లేక కేసు నమోదు చేయలేదని తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

నాదెండ్ల, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గణపవరం గ్రామ పరిధిలో గల క్వారీ కుంటలో మృతి చెందిన గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. సుమారు 30 సంవత్సరాలు వయస్సు కలిగిన ఆ యువకుడు మృత దేహాన్ని క్వారీ కుంట నుంచి బయటకు తీసి పోస్టుమార్టం కోసం చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాదెండ్ల ఎస్ఐ పుల్లారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ తీగలు తగిలి నాలుగు గేదెలు మృతి

నాదెండ్ల, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొరిజవోలు గ్రామ రెవెన్యూ పరిధిలో గల నుదురుపాడు రైల్వేస్టేషన్ సమీపంలో గల క్వారీ వద్ద విద్యుత్ తీగలు తగిలి నాలుగు గేదెలు శుక్రవారం రాత్రి మృతి చెందాయి. జంగలపల్లికి గ్రామానికి చెందిన తాతిరెడ్డి అజంతారెడ్డి, బాదినీడి చల్లకొండ, బాదినీడి బుల్లయ్యలకు చెందిన గేదెలు వేసవి కాలం కావటంతో మేత కోసం వదిలారు. అర్ధరాత్రి దాటినా ఇంటికి రాకపోవటంతో వెతుకులాట ప్రారంభించారు. ఈ క్రమంలో రైల్వే స్టేషన్ సమీపంలోని క్వారీ కుంట వద్ద గేదెలు మృతి చెందిన విషయాన్ని పశు పోషకులు గుర్తించారు. ఆ ప్రాంతంలో తక్కువ ఎత్తులోనే విద్యుత్ తీగలు ఉండటంతో ఈ తీగలు తగిలి విద్యుతాఘాతంతో మృతి చెందాయి. ఒక్కొక్క గేదె విలువ లక్ష రూపాయల వరకు ఉంటుందని పశు పోషకులు వాపోయారు. సుమారు నాలుగు లక్షల నష్టం సంభవించిందని, న్యాయం చేయాలని వారు విద్యుత్‌శాఖ అధికారులను కోరారు. ఘటనా స్థలాన్ని పశు వైద్యాధికారి శ్రీలక్ష్మీ సందర్శించి పోస్టుమార్టం నిర్వహించారు. కాగా తూబాడు గ్రామ సమీపంలోని అడ్డురోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక విద్యుత్ స్తంభం పొలాల్లో పడిపోయింది. ఇలాంటి సంఘటనలపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.



నూజెండ్లలో శనివారం వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

యువత ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలి

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్. మే 31 (ఆంధ్రజ్యోతి): విస్తృత ఉద్యోగావకాశాలను యువత అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. స్థానిక జూనియర్ కాలేజీ మైదానంలో శనివారం ఉద్యోగ మేళా కార్యక్రమం నిర్వహించారు. పల్లె, పట్టణం తేడా లేకుండా విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో హాజరయ్యారు. 251 మంది వివిధ కంపెనీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగ యువతను ఉద్దేశించి జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ సేల్స్ రిప్రజెంటేటివ్‌గా ప్రారంభించి ఎదిగిన తన జీవిత ప్రస్థానమే అందుకు నిదర్శనమన్నారు. ఇష్టంతో ఎంచుకున్న ఉద్యోగాల్లో కష్టపడి పని చేస్తే సాఫ్టువేర్ మించిన ఉద్యోగాలు కూడా ఉంటాయని తెలిపారు. తన కంపెనీల్లో నెలకు రూ.లక్ష నుంచి మూడు లక్షల జీతాలు తీసుకున్నవారు ఉన్నారని తెలిపారు. నేడు ప్రపంచంలో సీఈవోలుగా ఉన్న వారు మార్కెట్ రంగం నుంచి 65శాతం వచ్చారని తెలిపారు. తాను కూడా అలానే అంచెలంచెలుగా శివశక్తి బయోను స్థాపించి, 15 రాష్ట్రాల్లో 5000 మంది ఉద్యోగులతో వ్యాపారంలో ముందుకు పోతున్నామన్నారు. ప్రస్తుతం తన కంపెనీ రూ.1000 కోట్ల టర్నోవర్‌కు చేరిందని, మూడేళ్లలో రూ.2000 కోట్లు, ఏడేళ్లలో రూ.5000 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తన అనుబంధ సంస్థలైన పుస్కల్ అగ్రిటెక్, షణ్ముఖ్ అగ్రిటెక్‌లు కూడా వినుకొండ జాబ్ మేళాలో పాల్గొన్నట్లు తెలిపారు. కష్టపడేవారు ఎప్పుడూ ముందుకు పోతారని, ఇంటర్వ్యూలను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, పల్నాడు జిల్లా నైపుణాభివృద్ధి అధికారి ఈ తమ్మాజీరావు, జిల్లా అదనపు అధికారి రామాంజినేయులు, జిల్లా ఉద్యోగ కల్పనాధికారి రవీంద్రనాయక్, కంపెనీ హెచ్ ఆర్ ప్రతినిధులతో పాటు, తెలుగు క్లస్టర్ ఇన్‌చార్జులు, పట్టణ నాయకులు పాల్గొన్నారు. నూతనంగా ఉద్యోగాలకు ఎంపికైన యువతకు నియామక పత్రాలు అందచేసి అభినందించారు.



జాబ్‌మేళా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వినుకొండ పట్టణంలో 26వ వార్డులోని కట్ట కింద బజారులో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని జీవీ ఆంజనేయులు శనివారం ప్రారంభించారు. లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు పంపిణీ చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులందరికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, జనసేన జిల్లా కార్యదర్శి నిశ్శంకర శ్రీనివాసరావు, కౌన్సిలర్ షకీలా బేగం, లింగమూర్తి, గంధం కోటి, ఆయూబ్‌ఖాన్, షమీమ్, వలి, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం

● నియోజకవర్గ ప్రజలు సహకరించాలి : ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండపై ఉన్న రామలింగేశ్వరస్వామి దేవాలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు ఆలయ అభివృద్ధి కమిటీతో కలిసి గురువారం దేవస్థానం ఆవరణలో శనివారం హోమం, పూజలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ రాష్ట్రంలోని పల్నాడు జిల్లాలోని వినుకొండకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని మహాపుణ్య క్షేత్రం, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. స్థానిక ప్రజలతో పాటు రాయలసీమ, మిగిలిన రాష్ట్ర ప్రజలందరూ దర్శించుకొని పూజలు చేసుకునే విధంగా సమష్టి కృషితో ఈ క్షేత్రాన్ని పూర్తి చేయాలన్నదే తన సంకల్పమన్నారు. వినుకొండ రామలింగేశ్వర స్వామి దేవాలయం, ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం ఎంతో శుభపరిణామమని ఈ సందర్భంగా తెలిపారు. వినుకొండ ప్రజల ఇలవేల్పు కొండపై వెలసిన స్వామివారి ఆలయ పునర్నిర్మాణ పనులు మా చేతుల మీదుగా జరగడం సంతోషంగా ఉందన్నారు. నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా మాఘ మాసం నాటికి పూర్తి చేయాలన్న ఆకాంక్షతో కమిటీ సభ్యులందరికీ బాధ్యతలు అప్పగిస్తున్నామన్నారు. రామ లింగేశ్వరస్వామికొండను అభివృద్ధి చేసేందుకు అడిగిన వెంటనే రూ.2కోట్లు ఇచ్చిన సీఎం చంద్రబాబుకు, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధిలో వినుకొండ పట్టణంతో పాటు ఐదు మండలాల ప్రజల సహాయ సహకారాలు అందించి చేయూతనివ్వాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ పెద్దలతో పాటు వేదపండితులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు పాల్గొన్నారు.



రామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు

వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవాలు

నూజెండ్ల, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యోగిరెడ్డిపాలెం గ్రామంలో కోటి రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన దేవాలయాల్లో శనివారం శ్రీవిఘ్నేశ్వర జంట నాగేంద్ర, శ్రీసీతారామ లక్ష్మణ, హనుమత్ సమేత రామచంద్ర స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి, సీతాలాంబ జీవ ధ్వజస్తంభం, పోలేరమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ప్రతిష్ఠా మహోత్సవాల్లో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ పారా వెంకట లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు భాగవతుల రవికుమార్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సామూహిక అక్షరాభ్యాసం

నూజెండ్లలో శనివారం నూతన ప్రైవేట్ పాఠశాలను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 45 మంది విద్యార్థులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమాల్లో పాఠశాల డైరెక్టర్ అజయ్, వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ మీసాల మురళీ కృష్ణ యాదవ్, టీడీపీ నాయకులు లగడపాటి సూరిబాబు, బచ్చు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సదావర్తి స్థలంపై వాడీవేడిగా చర్చ

● అనుమతి లేని స్థలంలో నిర్మాణాలు చేపట్టే తీర్మానాన్ని రద్దు చేయాలని చైర్మన్‌కు వినతి

● హైకోర్టులో తేలేవరకు షాపింగ్ కాంప్లెక్స్‌పై చర్యలు తీసుకోరాదన్న వైసీపీ కౌన్సిలర్లు

వినుకొండటౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన సాధారణ, అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో మొత్తం 81 అంశాలను సభలో ప్రవేశపెట్టగా మొట్టమొదటి అంశాన్ని సింగర చెరువు నందు ఎస్ఎస్‌ట్యాంక్, రా వాటర్ ఛాంబర్ నిర్మాణ ఏర్పాటుకు రూ.4లక్షలు ఖర్చవుతుందనే అంశాన్ని రద్దు చేశారు. ఇదిలా ఉండగా ప్రధానంగా జూనియర్ కళాశాలలో ఆర్యవైశ్య సంఘానికి కేటాయించిన సదావర్తి భూములపై టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాదోపవాదాలు జరిగాయి. 7వ వార్డు కారంపూడి రోడ్డులో గల ఈఎల్ఎస్ఆర్ వద్ద ఖాళీ స్థలం నందు షాపింగ్ కాంప్లెక్స్, గ్రౌండ్ ఫ్లోర్ నిర్మించుటకు 2022 మే 27వ తేదీన మున్సిపాలిటీ తీర్మానించింది. సంబంధించిన స్థలంలో అనధికారికంగా పురపాలకసంఘం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడాన్ని ఆర్యవైశ్య సంఘం నాయకులు తీవ్రంగా వ్యతిరేకించి 2023 పనుల నిలుపుదల కోసం హైకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం స్థలానికి సంబంధించి ఆర్యవైశ్యులు ఇటీవల ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును కలిసి ఆర్యవైశ్య సదావర్తి సంఘానికి సంబంధించిన స్థలం నందు నిర్మించిన నిర్మాణాలతో సహా అప్పగించాల్సిందిగా అర్జీ దాఖలు చేశారు. అందుకైన ఖర్చు కూడా కాంట్రాక్టర్‌కు చెల్లిస్తామని హైకోర్టులో కేసు ఉపసంహరించేందుకు అర్జీ ద్వారా తెలియజేశారు. కానీ కౌన్సిల్ తీర్మానం నెం. 446, 2022, మే 27వ తేదీన తీర్మానాన్ని రద్దు పరచుటకు కౌన్సిల్ నిర్ణయం కోసం కౌన్సిల్ వద్ద ప్రవేశపెట్టారని 7వ వార్డు కౌన్సిల్ పత్తి వేదవతి మున్సి పల్ చైర్మన్ దస్తగిరికి అర్జీ దాఖలు చేశారు. ఈ విష యంపై మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు గాబ్రియేలు, రాజేష్ ఖన్నాలు ఖండించారు. గతంలో కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలం కేటాయించి ఆన్‌లైన్‌లో చూపిందని, ప్రస్తుతానికి హైకోర్టులో పెండింగ్‌లో ఉంచాలని సభ దృష్టికి తెచ్చా రు. దీంతో ఎవరికి ఏం చెప్పలేని దుస్థితిలో చైర్మన్ మి న్నకుండిపోయారు. కౌన్సిలర్లు లింగమూర్తి, నాగరాజు, పుల్లయ్య, జయరావు, కృష్ణవేణి, బాషా తదితరులు వార్డుల్లోని సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, అధికారులు పాల్గొన్నారు.



చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న 7వ వార్డు కౌన్సిలర్ పత్తి వేదవతి

89.5% పింఛన్ పంపిణీ పూర్తి

శావల్యాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11గ్రామ సచివాలయాల పరిధిలో మొత్తం 5759 పింఛన్ లబ్ధిదారులు ఉండగా 5154మందికి పింఛను పంపిణీ చేశామని, ఒకేరోజులో 89.5శాతం పంపిణీ పూర్తయిందని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య శనివారం తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని పొట్లూరు, పిచికలపాలెంలో కొంతమంది సరైన ఆధారాలు లేకుండా పింఛన్లు పొందారని, రీవెరిఫికేషన్ చేయాలని గ్రామస్థులు కొందరు నర్సరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల జరిగిన ప్రజాసమస్యల వేదికలో కలెక్టర్ అరుణ్‌బాబుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పొట్లూరులో 72మందికి, పిచికలపాలెంలో 9 మందికి నోటీసులు అందజేశామన్నారు. నోటీసులు అందుకొన్న లబ్దిదారులు తమ ఆధారాలను పంచాయతీ కార్యదర్శులకు చూపించినట్లయితే వాటినిపరిశీలించి కలెక్టర్‌కు అందజేసి వెంటనే పింఛను అందజేస్తామన్నారు.

● బొల్లాపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : పేరూరుపాడు గ్రామంలో యూనిట్ ఇన్‌చార్జ్ కాసరగడ్డ హనుమంతరావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు బొప్పూడి శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అవినీతిపై కౌన్సిల్‌లో చర్చ

చిలకలూరిపేట, మే 31(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మున్సిపల్ కార్యాలయంలో భారీ స్థాయిలో జరిగిన అవినీతిపై శనివారం చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వాడిగా వేడిగా చర్చ జరిగింది. ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని చేతివాటంకు 15 మంది మున్సిపల్ ఉద్యోగులు బలయ్యారని, వారి జీవితాలు రోడ్డున పడ్డాయని 10వ వార్డ్ కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి అన్నారు. దీనికి కారణం మాజీ మంత్రి విడదల రజిని, ఆమె మరిది విడదల గోపి, చైర్మన్ షేక్ రఫాని కారణం అని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను వైసీపీ కౌన్సిలర్ వలేటి వెంకటేశ్వరరావు ఖండించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి గంగా భవాని చేసిన అవినీతికి మాజీ మంత్రి రజినికి, గోపికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. అవినీతి జరుగలేదని నిరూపిస్తే రాజీనామా చేసేందుకు సిద్ధమని కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి అన్నారు. దీనితో వైసీపీ, టీడీపీ కౌన్సిలర్‌ల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వావాదం జరిగింది. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అవినీతిలో తన పాత్ర లేదని, కావాలనే కొంతమంది దురుద్దేశంతో దీనిని తనకు ఆపాదించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దైవ సాక్షిగా ప్రమాణం చేయడానికి సిద్ధమని చైర్మన్ రఫాని చెప్పారు. కాగా ఈ సందర్భంలో మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు సమాధానం ఇస్తూ అవినీతి చేసి, నకిలీ రసీదులతో ప్రజల సొమ్మును కాజేసి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని గంగా భవాని కోసం పోలీసులు వెతుకున్నారని చెప్పారు. ఆమె నుంచి రూ.12 లక్షలు కట్టించామని, మిగిలిన రూ.22 లక్షలను కూడా వసూలు చేస్తామని అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అవినీతిపై ప్రత్యేక ఆడిట్ జరుగుతున్నదని తెలిపారు. మాజీ మంత్రి విడదల రజిని ఇంటి వద్ద డ్రైనేజీ కాలువ మళ్లింపుపై టీడీపీ పక్ష నాయకుడు గంగా శ్రీనివాసరావు ప్రశ్నించారు. కాలువను మళ్లించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కాలువ మళ్లింపునకు గల కారణాలను స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై కమిషనర్ శ్రీహరిబాబు స్పందిస్తూ డ్రైనేజీ కాలువ మళ్లింపునకు సంబంధించి సమగ్ర సర్వే చేపిస్తామని హామీ ఇచ్చారు. సర్వే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎజెండాలోని 21 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది.




సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ షేక్ రఫాని

అయ్యప్ప స్వామి దేవస్థానం16వ వార్షికోత్సవం

చిలకలూరిపేట, మే31 (ఆంధ్రజ్యోతి): చిన్నపసుమర్రు పరిధిలో ఉన్న శ్రీఅయ్యప్ప స్వామి వారి దేవస్థానం16వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేవాలయంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పాల్గొన్నారు. ఓంకార స్వామి, శ్రీవేంకటేశ్వర స్వామికి విశేష అభిషేకములు, ప్రత్యేక అలంకరణలు చేశారు. వినుకొండ బాలానంద భజన మండలి అధ్యాపకుల నేతృత్వంలో బాలికలచే నృత్య ప్రదర్శన జరిగింది.

కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో
డిగ్రీ డ్యూయల్ మేజర్స్‌పై అవగాహన సదస్సు

నరసరావుపేట టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో శనివారం ఉన్నత విద్యా మండలి కొత్తగా ప్రవేశపెట్టిన నాలుగేళ్ల డిగ్రీ డ్యూయల్స్ మేజర్స్ ప్రోగామ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సింగిల్ మేజర్ కోర్సుల స్థానంలో డ్యూయల్స్ మేజర్స్ కోర్సులను, అదే విధంగా నైపుణ్యాభివృద్ధి కోర్సుల గురించి వివరించారు. కంప్యూటర్ కోర్సును ఎన్నుకున్న విద్యార్థులకు క్వాంటం కంప్యూటర్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డేటా సైన్స్ మైనర్ సబ్జెక్టుగా చదివే అవకాశం కల్పించారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే సతీష్, అకడమిక్ డైరెక్టర్, అధ్యాపకులు, సిబ్బంది, పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నాతాని

నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

● ఎక్సైజ్ సీఐ సోమయ్య

నరసరావుపేట లీగల్, మే 31 (ఆంధ్రజ్యోతి): వైన్ షాప్ నిర్వాహకులు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలుంటాయని నరసరావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సోమయ్య శనివారం హెచ్చరించారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని మండలంలో గల వైన్ షాపుల్లో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైన్‌షాప్‌లు సమయపాలన పాటించాలని ఆయన అన్నారు.



మద్యం దుకాణం తనిఖీల్లో పాల్గొన్న ఎక్సైజ్ సిబ్బంది

ఉద్యోగ విరమణ పొందిన పోలీసు సిబ్బందికి వీడ్కోలు



ఉద్యోగ విరమణ పొందిన పోలీసు సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, మే 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. పోలీసుశాఖలో చేరి విశేషసేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన వి.వెంకయ్య, కేవెంకటేశ్వర్లు, ఆర్ మధుసూదనరావు. ఎం నాగేశ్వరరావులను ఎస్పీ కార్యాలయంలో శనివారం ఎస్పీ కంచి శ్రీనివాసరావు శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఇన్ని సంవత్సరాల పాటు పోలీసుశాఖలో సమర్థవంతంగా, క్రమశిక్షణతో సేవలు అందించినందుకు అభినందించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ సంతోష్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ వి.సత్తిరాజు, డీసీఆర్‌బీసీ ఐ.శ్రీనివాసరావు, హోంగార్డ్ ఆర్ఐ కృష్ణ, వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్, ఏవోటీ దుర్గా ప్రసాద్, పల్నాడు జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ మాణిక్యాలరావు, సిబ్బంది, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

● జిల్లా రవాణాశాఖ అధికారి సంజీవ్‌కుమార్



వాహనాల తనిఖీల్లో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది

నరసరావుపేట రూరల్, చిలకలూరిపేట మే 31 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారణకు రవాణా, పోలీస్‌శాఖ సంయుక్తంగా వాహన తనిఖీలు చేపడుతున్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారి సంజీవ్‌కుమార్ తెలిపారు. శనివారం పోలీసు, రవాణా శాఖ, ఆర్‌టీసీ అధికారులు చిలకలూరిపేటలో, అమ రావతి మండలంలో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పరి మితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్న వాహనాలపై, సరుకు రవాణా వాహనాలపై, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న డ్రైవర్లపై కేసులు నమోదు చేశారన్నారు. చిలకలూరిపేట, అమరావతి మండలంలో 110 వాహనాలు తనిఖీలు నిర్వహించామన్నారు. అందులో 9 వాహనాలు స్వాధీనం చేసుకుని భద్రత నిమిత్తం ఆర్‌టీసీ స్థానిక డిపో నందు పార్కింగ్ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో 1,44,290 రూపాయలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు, 12 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో చిలకలూరిపేట, అమరావతి మండలంలో ఆర్టీసీ డీఎం, పోలీస్‌శాఖ తరపు నుంచి సీఐ, ఎస్ఐ, రవాణాశాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫైర్ సేఫ్టీపై మాక్ డ్రిల్

నరసరావుపేట టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంపొందించేందుకు రాష్ట్ర అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఫైర్ సేఫ్టీపై శనివారం మాక్ డ్రిల్ నిర్వహించారు. పల్నాడు జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎంవీ సుబ్బారావు, ఎస్ఐ జే శ్రీనివాసరావులు అగ్ని ప్రమాద సమయంలో అనుసరించాల్సిన తక్షణ చర్యలపై సూచనలు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ జీ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఇటువంటి మాక్‌డ్రిల్‌లు విద్యార్థుల్లో అత్యవసర పరిస్థితుల్లో స్పందించే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ ఆఫీసర్ హెచ్ గంగాధర్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌరులు హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

● డీటీ అనూరాధ

యడ్లపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి) : హక్కుల గురించి పౌరులు అవగాహన కలిగి ఉన్నప్పుడే వాటిని సద్వినియోగించుకోగలరని డిప్యూటీ తహసీల్దార్ అనూరాధ అన్నారు. యడ్లపాడు ఎస్టీ కాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు పౌరుల హక్కులు, బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. సరైన అవగాహన కలిగి ఉంటే రక్షణ పొందుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి, ఆర్ఐ ఎం సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి శశికళ, వీఆర్వో కేపీ చారి, ఏఎస్ఐ కోటేశ్వరరావు, గ్రామస్థులు పోపూరి రాఘవయ్య, గోనుగుంట్ల శ్రీనివాసరావు, రఫీ, కాలనీవాసులు పాల్గొన్నారు.

గోనుగుంట్లవారిపాలెంలో..

వినుకొండటౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): వినుకొండ మండలంలోని గోనుగుంట్ల వారిపాలెం నందు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ చట్టాలపై స్థానికులకు అవగాహన కల్పించి గ్రామాల్లో ఎవరూ ఘర్షణలకు పాల్పడవద్దని తెలిపారు.

సినీ నటుడు కృష్ణ జయంతి వేడుకలు



వినుకొండలో కేక్ కట్ చేసి ఫ్యాన్స్‌కు పంపిణీ చేస్తున్న పీవీ సురేష్, చికెన్‌బాబు

వినుకొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు కృష్ణ జయంతి వేడుకలను పట్టణంలోని అరుణహాల్ వద్ద మహేష్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మానవసేవా సమితి అధ్యక్షుడు, కృష్ణ అభిమాన సంఘం నాయకుడు పీవీ సురేష్, చికెన్‌బాబు, చిట్టిబాబు, రత్నకృష్ణ, కిషోర్, లక్ష్మీనారాయణ, వీరాంజి తదితరులు పాల్గొన్నారు.

● కారుమంచి(శావల్యాపురం)మే31(ఆంధ్రజ్యోతి): కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ యూత్ ఆధ్వర్యంలో సినీహీరో ఘట్టమనేని కృష్ణ జన్మదిన వేడుకలను కారుమంచిలోని సత్రం సెంటర్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈపూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, అభిమానులు, చిన్నారులతో కలసి కృష్ణ పుట్టినరోజు కేకును కట్ చేశారు. కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అభిమానులు శాఖమూరి శంకర్‌రావు, మహేష్, సుబ్బారావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట పట్టణం చిలకలూరిపేట రోడ్డులో వృద్ధుల ఆశ్రమంలో కృష్ణ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి వృద్ధులకు, అభిమానులకు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎండీ ఫారూఖ్‌బాబు అభిమానులు పీ వెంకటరావు, బీ కొండలరావు, ఎస్ థామస్, చందవరం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట, మే31 (ఆంధ్రజ్యోతి): కృష్ణ పుట్టినరోజు సందర్భంగా కృష్ణ, మహేష్ యువత హెల్పింగ్ పీపుల్స్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక కళామందిర్ సెంటర్‌లో శనివారం సేవాకార్యక్రమాలు నిర్వచించారు. యాచకులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు.